ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 87 | శుక్రవారం 26 డిసెంబర్ 2025 | పేజీలు - 10 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati






## దేశ ప్రగతికి గట్టి పునాది వేసిన యుగపురుషుడు

# వాజ్‌పేయి

**వాజ్‌పేయి చొరవతోనే జాతీయ రహదారులకు మహర్దశ**

**రోడ్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక వసతుల కల్పన**

**వాజ్‌పేయ్ అంటే ఒక చరిత్ర...యుగపురుషుడు**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**అమరావతి, డిసెంబర్ 25 :**

దేశ ప్రగతికి గట్టి పునాది వేసిన వ్యక్తి దివంగత ప్రధాని వాజ్‌పేయి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మనం జాతీయ రహదారులపై తిరుగుతున్నామంటే ఆద్యుడు వాజ్‌పేయి అని కొనియాడారు. పీపీపీ విధానంలో దేశం అభివృద్ధి చెందుతుందని ఆలోచించి.. ఆచరణలో పెట్టిన వ్యక్తి వాజ్‌పేయి అని సీఎం వెల్లడించారు. రోడ్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక వసతులు కల్పన వంటివి ఏర్పాటు చేసి సంపదను సృష్టించిన వ్యక్తి వాజ్‌పేయి అని తెలిపారు. ఈరోజు ఒక చరిత్ర.. ఒక యుగ పురుషుడు పుట్టిన రోజు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం నాడు అటల్ – మోడీ సుపరిపాలన యాత్ర ముగింపు సభలో సీఎం మాట్లాడుతూ.. శత జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్నరోజును.. ప్రజా రాజధాని, దేవతల రాజధాని అమరావతిలో జరుపుకోవడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. దేవతల రాజధాని ఏ విధంగా ఉందో ఊహించుకుంటున్నారన్నారు. అమరావతిని ప్రపంచం మొత్తం గుర్తు పెట్టుకునేలా చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ ప్రాంత రైతులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని.. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా 33వేల ఎకరాల భూమిని 29వేల మంది రైతులు ఒక్క రూపాయి తీసుకోకుండా ఇచ్చారని తెలిపారు. అటువంటి స్ఫూర్తిని ఇచ్చిన రైతులకు మిగతా 2లో

## 370 రద్దుతో కాశ్మీర్‌లో

# రాజ్యాంగం అమలు

**గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలు..**

**లక్నో గోమతి నదీ తీరంలో ప్రేరణాస్థల్ ప్రారంభం..**

**జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ ..**



**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 25 :**

ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు చేశామని చెప్పారు. గురువారం ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గోమతీ నది ఒడ్డున నిర్మించిన రాష్ట్ర ప్రేరణా స్థల్‌ను జాతికి అంకితం చేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ.. 'కోట్లాదిమందిని పేదరికం నుంచి విముక్తి చేశాం అన్నారు. గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలుచేశారు. వాజ్‌పేయి హయాంలోనే గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి బీజం పడింది. 2014 నుంచి గ్రామాల్లో 4 లక్షల కి.మీ. రోడ్ల నిర్మాణం జరిగింది. దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం మరింత పుంజుకుంది. వాజ్‌పేయి హయాంలోనే ఢిల్లీ మెట్రో ప్రారంభమైంది. భవిష్యత్‌లో అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి దేశంగా భారత్ మారనుందని అన్నారు. అందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుంది. లక్నోలో అతిపెద్ద డిఫెన్స్ కారిడార్ ఉంది. బ్రహ్మోస్ క్షిపణులు లక్నోలోనే తయారవుతున్నాయని అంటూ... మన బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం ప్రపంచమంతా చూసిందని అన్నారు. మొబైల్, ఇంటర్నెట్ వినియోగించే (మిగతా 2లో)

# ఘోర బస్సు ప్రమాదం

**టూరిస్ట్ బస్సును ఢీకొన్న కంటెయినర్ లారీ..**

**మంటలు చెలరేగడంతో 17మంది బుగ్గి..**

**క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో చికిత్స..**

**రాష్ట్రపతి , ప్రధాని మోడీ సంతాపం..**



**బెంగుళూరు, డిసెంబర్ 25 :**

కర్నాటకలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును లారీ ఢీ కొట్టడంతో బస్సులలో మంటలు చెలరేగి 17 మంది సజీవ దహనమయ్యారు. మరో మరో 13 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన చిత్రదుర్గ జిల్లా జవరగుండనహళ్లి శివారులో తెల్లవారు 3 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి గోకర్ణం వెళ్తున్న బస్సును లారీ ఢీ కొట్టింది. లారీ డ్రైవర్ సహా 17 మంది మృత్యువాత పడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 29 మంది ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తున్న సీబర్డ్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కంటెయినర్ లారీ ఢీకొట్టింది. లారీ.. డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ఈప్రమాదంలో 17 మంది ప్రయాణికులు సజీవ (మిగతా 2లో)

# ఆదర్శ రాజకీయవేత్త అటల్‌జీ

**వాజ్‌పేయ్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం..**

**దేశంలో కొత్త రాజకీయ సంస్కృతిని తెచ్చిన నేత..**

**సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించిన ప్రధాని..**

**అమరావతిలో తొలి వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు హర్షణీయం..**

**విగ్రహావిష్కరణ సభలో బిజెపి అధ్యక్షుడు మాధవ్**

**అమరావతి, డిసెంబర్ 25 :**

దివంగత మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి ఆహార్యం, రూపం, గొప్ప వ్యక్తిత్వం, అన్నీ ఆదర్శ ప్రాయమని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. 1942లో స్వతంత్ర సేనానిగా ఆయన ప్రయాణం మొదలైందని ప్రస్తావించారు. దేశంలో కొత్త రాజకీయ సాంస్కృతిక చైతన్యం తేవాలని వాజ్‌పేయి పని చేశారని పేర్కొన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీతో కలిసి అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. ప్రజల కోసం పోరాటాలు చేసి వాజ్‌పేయి జైలుకు కూడా వెళ్లారని తెలిపారు. పార్లమెంట్‌లో (మిగతా 2లో)



## రుషి కొండను సమాన్యులకు దూరం చేయొద్దు




**రుషికొండను కేవలం ఆదాయ వనరుగా చూడటం సరికాదు..**

బిజెపి ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్ రాజు

# పోటెత్తిన భక్తులు



**శ్రీవారి దర్శనానికి 30గంటల సమయం..**

**భక్తుల రద్దీతో అలిపిరి వద్ద ట్రాఫిక్ జాం..**

**వైకుంఠ ఏకాదశి సందర్భంగా భారీగా వస్తున్న భక్తులు..**

**సర్వదర్శనం టోకెన్లకోసం భక్తుల బారులు..**

**8వేల టోకన్లు మాత్రమే వుండటంతో నిరాశతో వెనుతిరిగిన భక్తులు..**

**తిరుమల, డిసెంబర్ 25 :**

తిరుమలకు భక్తుల రద్దీ పెరిగింది. తిరుమలకు భక్తులు పోటెత్తడంతో శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం పడుతోంది. శిలాతోరణం వరకు కొనసాగుతున్న భక్తుల క్యూ లైన్ ఉంది. తిరుపతి అలిపిరి దగ్గర భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. అలిపిరి చెక్ పాయింట్ దగ్గర పెద్ద ఎత్తున వాహనాలు బారులు తీరాయి. శ్రీవారి దర్శనానికి కంపార్టుమెంట్లన్ని నిండి వెలుపల క్యూలైన్ లో భక్తులు వేచి ఉన్నారు. వరుస సెలవులు.. వైకుంఠ ఏకాదశి.. నూతన సంవత్సర రద్దీ వేళ టీటీడీ కీలక సూచనలు చేస్తోంది. తిరుమలలో రద్దీ పెరిగింది. వరుస సెలవులు రావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు తరలి వస్తున్నారు. శ్రీవారి దర్శనం కోసం బారులు తీరారు. కంపార్టుమెంట్లు అన్నీ నిండుకొని శిలా తోరణం వరకు క్యూ లైన్లు కొనసాగుతున్నాయి. జనవరి 10వ తేదీ వరకు ఈ రద్దీ కొనసాగే అవకాశం ఉందని టీటీడీ అంచనా వేస్తోంది. చాలా కాలం తరువాత ఈ స్థాయిలో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఈ రోజు ఉదయం నుంచి (మిగతా 2లో)

# తెలుగు రాష్ట్రాల్లో క్రిస్మస్ శోభ

**చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు..**

**మెదక్ చర్చికి వేలాదిగా భక్తుల రాక..**

**హైదరాబాద్ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు..**

**విజయవాడలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు..**

**పులివెందుల చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న జగన్, కుటుంబ సభ్యులు...**



**హైదరాబాద్/విజయవాడ, డిసెంబర్ 25 :**

క్రిస్మస్ వేడుకలను తెలుగు రాష్ట్రాల్లోని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు చర్చిల్లో క్రిస్మస్ ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో మొదలయ్యాయి. ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చర్చి పరిసర ప్రాంతమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. క్రిస్మస్ వేడుకల ప్రారంభ సూచకంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి చుట్టూ శిలువ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. శిలువను ముందు ఉంచి క్రైస్తవులు ప్రార్థనా గీతాలు ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ ఊరేగింపు సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని చర్చి ప్రాంగణాలు ఆధ్యాత్మిక సందేశాలతో మార్మోగాయి. 'శాంతి, ప్రేమ, సోదరభావం' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ కార్యక్రమం సాగింది. క్రిస్మస్ వేడుకల ప్రారంభ ఆరాధనకు తెలుగు రాష్ట్రాల్లోని పలు చర్చిలకు క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. పులివెందుల చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వైఎస్ జగన్ తన కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సతీమణి భారతి, తల్లి విజయమ్మ ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే మెదక్ చర్చిలో ఏటా ప్రత్యేక ప్రార్థనలు జరుగతాయి. గురువారం ఉదయం నిర్వహించిన మొదటి ఆరాధనకు చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసి పోవడంతో బయట ప్రాంగణంలో కూడా భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇందుకు అనుగుణంగా చర్చిల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. చర్చి ప్రాంగణాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అద్భుతంగా అలంకరించారు. చర్చి ప్రధాన ద్వారాలను విద్యుత్ కాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చర్చిల ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో మెరిసిపోతూ భక్తులను ఆకట్టుకున్నాయి. మెదక్‌లోని ప్రసిద్ధ సీఎస్ఐ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. చర్చి చుట్టూ శిలువ ఊరేగింపు, ప్రత్యేక (మిగతా 2లో)

## ఒకప్పటి ఐటీ మ్యాన్

# నేటి ఏఐ మ్యాన్

**చంద్రబాబుకు శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసలు**

**అమరావతి, డిసెంబర్ 25 :**

ఒకప్పటి ఐటి మ్యాన్ నేటి ఎఐ మ్యాన్ చంద్రబాబు నాయుడు అంటూ కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసలు కురిపించారు. ఎన్‌డిఎ కన్వీనర్‌గా చంద్రబాబు దార్శనికతను ప్రదర్శిం చారని అన్నారు. రాజధాని అమరావతిలో 14 అడుగుల వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి సీఎం చంద్ర బాబు ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. మనందరీ ముఖ్య నేత అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహం ఆవిష్కరణకు సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొనటం ఆనం దంగా ఉంది.. హిందీలో అమ్మనీ (మిగతా 2లో)



# నియంత పాలన

**మంత్రి పిఎ మహిళా వేధింపులపై చర్యలేవీ**

**వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి**

**విశాఖపట్నం, డిసెంబర్ 25 :**

రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని, అధికార టీడీపీకి ఏపీ పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆరోపించారు. మంత్రి సంధ్యా రాణి పీఏ సతీష్.. మహిళలను లైంగికంగా వేధించడం నిజం కాదా? అని ప్రశ్నించారు.ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మీడియాతో మాట్లాడుతూ..'మంత్రి సంధ్యారాణి పీఏ సతీష్ వ్యవహారంలో బాధితురాలిపై తిరిగి కేసు పెట్టారు.. మంత్రి డైరెక్షన్‌లోనే ఆమెపై కేసు (మిగతా 2లో)



# దేశప్రగతికి గట్టి పునాది వేసిన యుగపురుషుడు

(మొదటి పేజి (తరువాయి)

శిరస్సు వంచి నమస్కారాలు తెలియచేస్తున్నట్లు చెప్పారు. అమరావతిలో ఒక చరిత్రను సృష్టించే విధంగా వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈనెల 11 నుంచి అటల్ మోదీ సురిపాల యాత్రను ప్రారంభించారని తెలిపారు. అమరావతిలో 14 అడుగుల వాజ్‌పేయ్ విగ్రహాన్ని ఆవిష్కరించామని సీఎం తెలిపారు. శాశ్వతంగా ప్రజలకు గుర్తుండిపోయేలా ఈ స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. దేశానికి సుపరిపాల యాత్రను పరిచయం చేసిన వ్యక్తి వాజ్‌పేయి అని.. అందుకే మోదీ డిసెంబర్ 25న గుడ్ గవర్నెన్స్ డేగా ప్రకటించారన్నారు. ఆరోజు వాజ్‌పేయి, నేడు మోదీ విలక్షణమైన వ్యక్తిత్వం, చరిత్రను తిరగరాసే నాయకత్వం వారిలో ఉందని చెప్పుకొచ్చారు. తనకు ఎప్పుడూ స్ఫూర్తిని ఇచ్చే నేత ఎన్టీఆర్ అని అన్నారు. దేశంలో యాంటీ కాంగ్రెస్ కోసం పని చేసిన నేతలు వాజ్‌పేయి, ఆ తర్వాత ఎన్టీఆర్ మాత్రమే అని తెలిపారు. ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాడు కుట్రతో కూలిస్తే.. అండగా నిలబడిన వ్యక్తులు వాజ్‌పేయి,
అద్వానీ మాత్రమే అని గుర్తుచేశారు. నేషనల్ ఫ్రంట్ పెట్టి చైర్మన్‌గా వాజ్‌పేయికు సహకరించిన వ్యక్తి ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. డిసెంబర్ 25న గ్వాలియర్‌లో సామాన్య కుటుంబంలో వాజ్‌పేయి పుట్టారని.. జనసంఘ్ బీజేపీ నుంచి 10 సార్లు ఎంపీ, రెండుసార్లు రాజ్యసభకు ఎంపిక అయ్యారని తెలిపారు. మంచి వక్తతో పాటు, అద్భుతమైన కవి, మానవతావాది వాజ్‌పేయి అని అన్నారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు తాను చాలా సన్నిహితంగా ఉన్నానని.. అటల్ పని చేసే ఆలోచనలు బాగా తెలిసిన వ్యక్తిని తానే అని తెలిపారు. విమానాల గురించి అడిగితే వెంటనే అనుమతులు ఇచ్చారని.. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు హైదరాబాద్‌లో వచ్చిందంటే అటల్ జీ కారణమన్నారు. దేశంలో లక్షా 46వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. ఆరోజు అణు పరీక్షలు చేస్తే డబ్బులు ఇవ్వమని అమెరికా ఆంక్షలు పెడితే.. తనకు దేశం ముఖ్యమని అణుపరీక్షలు చేసిన వ్యక్తి వాజ్‌పేయి అని వెల్లడించారు. నాడు వాజ్‌పేయి కార్గిల్ యుద్ధం.. నేడు మోదీ ఆపరేషన్ సింధూర్ చరిత్రలో మిగిలి పోతాయన్నారు. దేశం జోలికి వస్తే ఖబడ్దార్ అని నిరూపించిన నాయకులు వాజ్‌పేయి, నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు. కొంతమంది నాయకులు శాశ్వతంగా స్ఫూర్తిని ఇస్తారని.... దేశం కోసం బతుకుతారని, దేశం కోసం ఆలోచిస్తారన్నారు. మరికొంత మంది నాయకులు మాత్రం స్వార్థం కోసమే ఆలోచిస్తారని.... స్వార్థం కోసమే పని చేస్తారని విమర్శించారు. ఈ భారతదేశం ఉన్నంత కాలం భారతీయుల గుండెల్లో ఉండే వ్యక్తి వాజ్‌పేయి అని స్పష్టం చేశారు. అందుకే అమరావతిలో విగ్రహం, స్మృతి వనం పెట్టుకున్నామని వివరించారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఎన్టీఆర్, వాజ్‌పేయి చేసిన సేవలు గుర్తుండిపోయేలా ఎన్డీఏ ప్రభుత్వం కార్యక్రమాలు చేస్తుందని వెల్లడించారు. ప్రపంచంలో భారత్ దేశం 11వ స్థానంలో ఉంటే... మోదీ సారథ్యంలో నాలుగో స్థానంలోకి తెచ్చారన్నారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో నెంబర్ వన్ దేశంగా తయారు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆ



సత్తా, ఆ శక్తి నరేంద్ర మోదీకి ఉందన్నారు. ఆరోజు వాజ్‌పేయి, ఎన్టీఆర్... దేశం కోసం ఆలోచించారని, తెలుగు జాతీ కోసం ఆలోచన చేశారని.. నేడు మోదీ, తాను కలిసి దేశాన్ని, రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపే బాధ్యత తీసుకుంటున్నామని తెలిపారు. అమరావతిలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని.. ఇంకా గేర్ పెంచుతామన్నారు. ఐటీకి సంబంధించి సైబరాబాద్‌లో హైటెక్ సిటీని ఓపెన్ చేసిన వ్యక్తి వాజ్‌పేయి అని తెలిపారు. నేడు అమరావతిలో క్వాంటమ్ బిల్డింగ్‌ను త్వరలోనే ఓపెన్ చేసుకోబోతున్నామని చెప్పారు. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్, అభివృద్ధికి మోదీ పూర్తిగా సహకారం అందిస్తున్నారని చెప్పారు. మొన్నటి వరకు వెంటిలేటర్‌పై ఉన్న ఏపీ.. ఇప్పుడు తిరిగి కోలుకుని, నిలబడే పరిస్థితికి వచ్చామన్నారు. వాజ్‌పేయి చేసిన అభివృద్ధి, చూపిన దారి, స్ఫూర్తి, పీపీపీల ద్వారా సంపదను సృష్టించారని.. ఇప్పుడు ఏమీ తెలియని నాయకులు పీపీపీ గురించి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మెరుగైన సేవలు అందించాలన్నా.. సంపద సృష్టించాలన్నా.. ఉద్యోగాలు కల్పించాలన్నా.. పీపీపీ మోడల్ కరెక్ట్ అని అందరం చూశామన్నారు. కొంతమంది అబద్ధాలు ప్రచారం చేయడమే కాకుండా.. అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అయితే జైలులో పెడతామనే నాయకులు తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద, ఆనందం, ఆరోగ్యం.. ఈ మూడు ప్రతిఒక్కరికీ అందించే దిశగా ముందుకు పోతున్నామని స్పష్టం చేశారు. ఆనాడు వాజ్‌పేయి, ఎన్టీఆర్ స్ఫూర్తి.. ఇప్పుడు తమకు పూర్తిగా సహకారం అందించే వ్యక్తి నరేంద్రమోదీ అని చెప్పుకొచ్చారు. ఈ స్ఫూర్తిని ఇంటింటికీ తీసుకు వెళ్లే బాధ్యత తీసుకోవాలని కూటమి నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

# ఆదర్శ రాజకీయవేత్త ఆటల్‌జీ

(మొదటి పేజి (తరువాయి)

అడుగుపెట్టి తొలి ప్రసంగంలోనే అందరినీ ఆకట్టుకున్నారని చెప్పుకొచ్చారు. అటల్ - మోదీ సుపరిపాలన యాత్ర ముగింపు సభ గురువారం వెంకటపాలెం వద్ద నిర్వహించారు. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, నారాయణ, సత్యకుమార్ యాదవ్, కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ ప్రసంగించారు .'వాజ్‌పేయి జయంతిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించారు. ఏపీ రాజధాని అమరావతిని ఆదర్శ రాజధానిగా నిలబెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. అటువంటి అమరావతిలో వాజ్‌పేయ్ తొలి విగ్రహాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఇచ్చిన చంద్రబాబుకు ధన్యవాదాలు. 13 అడుగుల వాజ్‌పేయి కాంస్య విగ్రహ ఆవిష్కరణకు చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లు రావడంతో ఈ కార్యక్రమానికి మరింత వన్నెవచ్చింది. చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్ ఇద్దరూ నాలుగు సార్లు సీఎంగా ఉండటం విశేషం. కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ తరలి రావడం ఆనందంగా ఉంది. ఈ విగ్రహ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా మంత్రి నారాయణ సహకరించారు. నేను చిన్ననాటి నుంచి వాజ్‌పేయిను చూసే అదృష్టం కలిగింది. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా నేడు ఆయన శతజయంతిని నిర్వహించడం ఆనందం కలిగించిందన్నారు. ప్రతి జిల్లాలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తిని తెలియజేశాం. ఈ కార్యక్రమాల గురించి చంద్రబాబుకు చెప్పగానే.. సంతోషం వ్యక్తం చేసి.. పూర్తిగా సహకారం అందించారు. కూటమి పార్టీల నేతలంతా భాగస్వామ్యం కావాలని టెలిఫోన్ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు ఇచ్చారు. వాజ్‌పేయి విగ్రహాల ఆవిష్కరణ, యాత్రలకు సహకారం అందించాలని చెప్పిన సీఎం చంద్రబాబుకు నా ధన్యవాదాలు. అమరావతిలో మేమే ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చంద్రబాబు ఆరోజే మాకు చెప్పారు' అని చెప్పుకొచ్చారు పీవీఎన్ మాధవ్.'మేము వాజ్‌పేయి విగ్రహంతో పాటు, స్మృతి వనం ఏర్పాటు చేయాలని కోరగానే సీఎం అంగీకరించారు. సచివాలయం, అసెంబ్లీకి వెళ్లే ఉద్యోగులు, పాలకులు అందరూ వాజ్‌పేయిను స్మరిస్తూ వెళ్లే విధంగా వెంకటపాలెం కూడలిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు. సుపరిపాలన కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎంను కోరుతున్నాం. రాజకీయాల్లోకి రావాలన్నా, ప్రజాప్రతినిధి కావాలన్నా.. ఈ కేంద్రం ద్వారా విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆనాడు నెహ్రూ కూడా భావి భారత ప్రధానిగా వాజ్‌పేయిను అభివర్ణించారు. ఇందిరా
ఎమ్జర్గ÷న్సీ రోజుల్లో 19 నెలలు జైలులో ఉండి పోరాటం చేశారు. దేశంలో కాంగ్రెస్ యేతర పక్షాలను ఏకం చేసి అధికారంలోకి తీసుకువచ్చారు. దేశంలో మహాత్మాగాంధీ చెప్పిన విధంగా, అంత్యోదయ, సర్వోదయ పేరుతో చిట్టచివరి వ్యక్తికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నారు' అని పీవీఎన్ మాధవ్ తెలిపారు.'విలువలతో కూడిన రాజకీయాలు చేయాలనే ఐదు అంశాలతో ఈ కమలం గుర్తును ఏర్పాటు చేశారు. రెండు సీట్లే వచ్చినా... నిరాశ పడకుండా వాజ్‌పేయి, అద్వానీ కలిసి అందరినీ కలుపుకుంటూ ముందుకు సాగారు. 1996లో 160 సీట్లతో బీజేపీ అతి పెద్ద పార్టీగా నిలిచింది. అనేక పార్టీలను కలుపుకుని ప్రధాని అయిన వాజ్‌పేయి13 రోజుల్లో దిగిపోయారు.1998లో ప్రధానిగా ఉన్న సమయంలో ఒక్క ఓటుతో పదవిని వదిలి, విలువలను కాపాడారు. 1999లో పూర్తిస్థాయి ప్రధానిగా దేశం దశ దిశను మార్చారు. అనేక ఆదర్శవంతమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపించారు. వాజ్‌పేయి స్ఫూర్తితో మోదీ అద్భుతమైన పాలన చేస్తున్నారు. కూటమిపై నమ్మకంతో ప్రజలు అధికారం కట్టబెట్టారు. ఆ నమ్మకం నిలబెట్టుకునేలా రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుంది. అటల్ - మోదీ సుపరిపాల యాత్రను డిసెంబరు 11వ తేదీన ధర్మవరంలో ప్రారంభించి, నేడు ముగింపు సభ చేసుకుంటున్నాం. ఎక్కువగా విగ్రహాలు పెట్టకుండా జిల్లాకు ఒక వాజ్‌పేయి విగ్రహం పెట్టి ఆయన స్ఫూర్తిని ప్రజలకు తెలియజేశాం. వాజ్‌పేయి చూపిన ఆదర్శవంతమైన రాజకీయాల గురించి నేటి తరం, భవిష్యత్ తరాలు తెలుసుకోవాలి. అని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

# రుషికొండను సామాన్యులకు దూరం చేయొద్దు

## కేవలం ఆదాయ వనరుగా చూడటం మంచిది కాదు..

## బిజెపి ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు

**అమరావతి, డిసెంబర్ 25 :**

రుషికొండ భవనాల అంశంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం ఈ వ్యవహారం తేల్చేందుకు మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసింది. ఆతిథ్య రంగం నుంచి ఇప్పటికే పలు ప్రతిపాదనలు అందాయి. ఈ భవనాల పైన అదనంగా నిర్మాణాలు చేయటం ద్వారా ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయానికి వచ్చారు. కాగా, ఈ భవనాల వినియోగం పైన తాజాగా బీజేపీ ముఖ్య నేత కీలక వ్యాఖ్యలు చేసారు. ప్రభుత్వం ముందు కొత్త డిమాండ్ ఉంచారు. ఇప్పుడు ఈ వ్యవహారం ఆసక్తి కరంగా మారుతోంది.రుషికొండ భవనాల సబ్ కమిటీ ఆలోచనలు చేసింది. ప్యాలెస్ నిర్మాణంలో కొన్ని మార్పులు చేసి, ఆతిథ్య రంగానికి కేటాయిస్తే బాగుంటుందనే ప్రతిపాదనకు మెజారిటీ మంత్రులు మొగ్గు చూపారు. అయితే, ఈ నెల 28న ఆన్‌లైన్‌లో భేటీ అయి అన్నిరకాల ప్రతిపాదనలపై మరోసారి చర్చించాల ని సబ్ కమిటీ నిర్ణయించింది. కాగా, బీచ్ ఫ్రంట్ వినియోగంపై కూడా కమిటీ సుదీర్ఘ చర్చించింది.అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ మాల్దీవులు, పుదుచ్చేరి తరహా విధానాలను అనుసరిస్తే బాగుంటుందనే అభిప్రాయం వచ్చింది. 'రుషికొండ కింద ఉన్న తొమ్మిది ఎకరాలను హోటళ్ల కోసం అదనంగా కొంతమంది అడిగారని చెప్పిన మంత్రులు...అందులో ఏడు ఎకరాల్లో అదనపు భవనాలు, సదుపాయాలు కల్పించే వీలుందని వెల్లడించారు.కాగా, ఈ భవనాల పైన కొత్త నిర్మాణాలు చేస్తే హోటళ్లకు అనుకూలంగా ఉంటుందనే అభిప్రా యం వ్యక్తం అయింది. దీని పైన బీజేపీ శాసనసభా ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు కీలక వ్యాఖ్యలు చేసారు. ఆరేళ్లుగా రుషికొండను మూసేసారని చెప్పారు. రుషికొండను కేవలం ఆదాయ వనరుగా చూడటం సరికాదన్నారు. రుషికొండ పైన ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. హోటళ్లకు కేటాయింటం అంటే సామాన్యులకు దూరం చేయటమేనని విష్ణు కుమార్ రాజు పేర్కొన్నారు.ఈ విషయంలో విశాఖ ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక సిటీగానూ ఉండాలని పేర్కొన్నారు. టీటీడీకి అనుబంధంగా రుషికొండ భవనాలను కేటాయించాలని.. ఆధ్యాత్మిక ఎగ్జిబిషన్ గా మార్పు చేయాలనేది సామాన్యుడి కోరిక గా వివరించారు. విశాఖ ఎంపీతో పాటుగా ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. దీంతో.. ఇప్పుడు ఈ భవనాల వినియోగం పైన తాజాగా బీజేపీ నేత డిమాండ్ పైన ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# చర్చిలలో క్రిస్‌మస్ శోభ



(మొదటి పేజి (తరువాయి)


ప్రార్థనలతో వేడుకలు ఆరంభించారు. మొదటి ఆరాధనకు భక్తులు భారీగా పాల్గొన్నారు. దైవ సందేశాన్ని ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబిన్ మార్క్ వినిపించారు. ఆయన ప్రసంగంలో ఏసు క్రీస్తు జన్మ వెనుక ఉన్న అసలు సందేశాన్ని వివరించారు. ప్రేమ, క్షమ, త్యాగం, మానవత్వం వంటి విలువలు ఈ ప్రపంచానికి ఎంత అవసరమో ఆయన తన ఉపన్యాసంలో స్పష్టంగా చెప్పారు. సమాజంలో పెరుగుతున్న ద్వేషం, అసహనం మధ్య క్రిస్మస్ పండుగ మనకు శాంతి మార్గాన్ని చూపుతుందని ఆయన పేర్కొన్నారు. ఇకపోతే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు వైభవంగా సాగాయి. విజయవాడ గుణదల మేరీమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ రంగు రంగుల విద్యుత్ కాంతులతో చర్చి ప్రాంగణం శోభాయమానంగా ఉంది. క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. చర్చిలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలతో సందడిగా మారాయి. ఈ వేడుకలు జిల్లాలో శాంతి, సంతోష వాతావరణాన్ని తీసుకువస్తాయని క్రైస్తవులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చర్చి లోపల కూడా ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఏసు క్రీస్తు జన్మ ఘట్టాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాటు చేశారు. పండుగ వాతావరణంలో పిల్లల సందడి చర్చికి మరింత శోభను తీసుకువచ్చింది. పేదలకు ఆహార పంపిణీ, అవసరమైన వారికి సహాయం వంటి సేవా కార్యక్రమాలను కూడా చర్చి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. సికింద్రాబాద్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. భారీగా క్రైస్తవులు తరలి రావడంతో భద్రతా ఏర్పాట్లను కూడా కట్టుదిట్టం చేశారు. చర్చి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్వచ్ఛంద సేవకులు సహాయం అందించారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. సిటీలోని పలు చారిత్రాత్మక చర్చిలలో క్రిస్టియన్స్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. క్రైస్తవుల రాకతో మియపూర్ కల్వరి టెంపుల్ కిటకిటలాడింది. కల్వరి టెంపుల్‌లో ఈ ఒక్కరోజే 5 లక్షల మందికి పైగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. సికింద్రాబాద్, అబిడ్స్‌లోని చారిత్రాత్మక చర్చిలలో తెల్లవారుజాము నుంచే క్రిస్మస్ సందడి నెలకొంది. మంచిర్యాల జిల్లాలోని మందమర్రి, రామకృష్ణపూర్ సీఎస్ఐ, సీయోను, పెంతేకొస్తు చర్చిలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవులందరికీ క్రిస్టమస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# కేసుల కొట్టివేత దుర్మార్గం

## వీటిపై హైకోర్టులో కొట్లాడుతాం

## వైకాపా లీగల సెల్ కార్యదర్శి పొన్నవోలు

**అమరావతి, డిసెంబర్ 25 :**



ఏపీలో నియంత పాలన నడుస్తోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి(లీగల్) పొన్నవోలు సుధాకర్ రెడ్డి అన్నారు. కూటమి పాలనలో వ్యవస్థలు కీలుబొమ్మలుగా మారాయని ఆరోపించారు. చంద్రబాబు తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ కేసులు కొట్టివేయించు కుంటున్నారు. చంద్రబాబుపై కొట్టివేసిన కేసులన్నింటిపై ఉన్నత న్యాయస్థానంలో కొట్లాడుతాం అని హెచ్చరించారు.వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ఒక నియంతలా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబుపై ఉన్న కేసులన్నీ ఒక్క నెలలో ఎలా కొట్టివేశారో అర్థం కావడం లేదు. కేసు పెట్టిన వ్యవస్థలే చంద్రబాబు నీతిమంతుడు అని క్లీన్ చిట్ ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. చంద్రబాబు తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. సీఐడీ, సిట్ సాక్షాదారాలు లేవని చంద్రబాబుపై ఉన్న కేసులు కొట్టివేశారని గుర్తు చేశారు. స్కిల్ డెవలప మెంట్ కేసులో వందల మందిని విచారించి ఆధారాలు సేకరించారు. ఆ ఆధారాలు అన్నీ ఏమయ్యాయి?. ఏపీలో దొంగా పోలీసు ఆట నడుస్తుంది.. దొంగలు వారే.. న్యాయ నిర్ణేతలు వారే. కేసులో స్పష్టమైన ఆధారాలు ఉన్నాయనే కోర్టు చంద్రబాబును జైలులో వేసింది. మరి ఇప్పుడు ఆధారాలు ఏమయ్యాయి?. చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారులు భవిష్యత్‌లో దోషులుగా నిలబడక తప్పదు. చంద్రబాబుపై కొట్టివేసిన కేసులపై మళ్లీ ఉన్నత న్యాయస్థానాల్లో కొట్లాడుతాం' అని వ్యాఖ్యలు చేశారు.

# రాజ్యాంగం అమలు

(మొదటి పేజి (తరువాయి)



దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం' అని అన్నారు. కాగా, సుమారు 65 ఎకరాల విస్తీర్ణంలో 230 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మితమైన రాష్ట్ర ప్రేరణా స్థల్ జాతీయ స్మారక సముదాయంలో అటల్ బిహారీ వాజ్‌పేయితో పాటు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయల ఆదర్శాలకు అనుగుణంగా వారి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఎం యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనంద్ బెన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘోర బస్సు ప్రమాదం

(మొదటి పేజి (తరువాయి)

దహనమయ్యారు. చిత్రదుర్గ జిల్లాలోని జాతీయ రహదారి-48పై గోర్లత్తు క్రాస్ వద్ద గురువారం వేకువజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. చిత్రదుర్గ, తుమకూరు జిల్లాల పరిధిలోని అధికార యంత్రాంగం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి అతివేగం, పొగమంచు కారణమని భావిస్తున్నారు. బస్సుతో పాటు కంటెయినర్ లారీకి కూడా మంటలు వ్యాపించాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్, కో డ్రైవర్ అందులోంచి దూకి తప్పించుకున్నారు. మరికొందరు ప్రయాణికులు అద్దాలను పగులగొట్టి ప్రాణాలు కాపాడుకున్నారు. వారిలో గగన, రక్షిత అనే యువతులు ఉన్నారు. తమ స్నేహితురాలు రష్మి కనిపించడం లేదని వారు కన్నీరుమున్నీరయ్యారు. ప్రయాణికుల్లో కొంతమందికి గాయాలు కావడంతో వారిని సిరా, హిరాయూరు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# పోటెత్తిన భక్తులు

(మొదటి పేజి (తరువాయి)

వస్తున్న వారితో అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. అక్కడ వాహనాల రద్దీ అధికంగా ఉంది. చెక్‌పాయింట్ నుంచి గరుడ సర్కిల్ వరకు వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. సర్వదర్శనం టోకెన్ల కోసం శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్‌ల వద్ద భక్తులు బారులు తీరారు.అయితే, కేవలం 8 వేల టోకెన్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో చాలా మంది భక్తులు నిరాశతో వెనుదిరిగారు. 30 వేల మందికి పైగా భక్తులు సర్వదర్శనం కోసం తిరుమలకు చేరుకున్నట్లు అంచనా. తిరుమలలో మాడవీధులు, అఖిలాండం, లడ్డూ కేంద్రం, అన్నప్రసాద భవనం, వసతి సముదాయాలు భక్తులతో నిండిపోయాయి. పెరిగిన భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఇక.. 30న వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి, జనవరి 1న ప్రముఖులు సైతం పెద్ద సంఖ్యలో తిరుమలకు రానున్నారు. దీంతో.. టీటీడీ తొలి మూడు రోజుల దర్శనాల కోసం మూడు ప్రాంతాల నుంచి భక్తులను అనుమతించాలని నిర్ణయించింది. అదే విధంగా సాధారణ భక్తులకు దర్శనానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించింది. భక్తులు దర్శనం కోసం టోకెన్ పైన కేటాయించిన సమయానికి క్యూ లైన్ల వద్దకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# నేటి ఏఐ మ్యాన్



(మొదటి పేజి (తరువాయి)

అంటారు కానీ మధ్యప్రదేశ్ లో మాత్రం మామా అంటూ రెండు సార్లు స్మరించుకుంటారని శివరాజ్ సింగ్ అన్నారు. అటల్ బిహారీ వాజ్ పేయి గురించి అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆయన ప్రసంగాలు విని ఎప్పటికైనా ఈ నవ యువకుడు దేశ ప్రధాని అవుతాడని జోస్యం చెప్పారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ చౌహాన్ తెలిపారు. పార్టీలు వస్తాయి పోతాయి కానీ దేశం ముఖ్యం, దేశ భక్తి ముఖ్యం అన్న నినాదం అటల్ జీ ది.. దేశ భద్రత విషయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీకి పూర్తి సహకారం వాజ్ పేయి అందించారు.. కానీ, నేను ఇందిరా మనవడు రాహుల్ గాంధీ మాత్రం భద్రత విషయంలో మోడీనీ ప్రశ్నిస్తూ ప్రత్యర్థి దేశాలకు మద్దతు ఇస్తున్నట్లుగా ఉంది.. మొదటిసారి ప్రధానిగా అవకాశం దక్కించుకున్న అటల్ జీ తన పదవినీ కాపాడుకునేందుకు రాజకీయ విలువల్ని వదలలేదని శివరాజ్ సింగ్ పేర్కొన్నారు. అయితే, రెండవ సారి ప్రధానిగా అటల్ జీ అవకాశం దక్కించుకున్న తర్వాత ఆయన చంద్రబాబుతో రాజకీయ సంబంధాలే కాకుండా ఆత్మీయ సంబంధం కలిగి ఉన్నాడని శివరాజ్ సింగ్ అన్నారు. అటల్ జీ- చంద్రబాబు భాగస్వామ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పరుగులు పెట్టింది.. నేడు మోడీ- చంద్రబాబు నాయకత్వంలో విభజన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది అన్నారు. చంద్రబాబు ఎన్‌డిఎ కన్వీనర్ గా విజయవంతంగా కూటమినీ నడిపిన రథ సారథి అన్నారు.

# నియంత పాలన

(మొదటి పేజి (తరువాయి)

నమోదు చేశారు. అధికారం చేతిలో ఉంది కదా అని మంత్రి, సతీష్ ఇలా వ్యవహరిస్తున్నారు. ఒక మహిళను, మరొక మహిళా మంత్రి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం. టీడీపీ తొత్తుల్లాగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. మంత్రి పీఏ మహిళలను లైంగికంగా వేధించడం నిజం కాదా అని ప్రశ్నించారు. బాధితురాలి దగ్గర సతీష్ డబ్బులు తీసుకోవడం నిజం కాదా?. ఇప్పటికైనా సతీష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ ఘటన పట్ల సీఎం చంద్రబాబు సిగ్గుతో తలదించుకోవాలి. మహిళలకు అన్యాయం జరిగితే తాట తీస్తానన్న పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారు?. ఇంతా జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదు?. హోం మంత్రిగా అనిత విఫలమయ్యారు' అని ఘాటు విమర్శలు చేశారు.

## భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

*పాపాల పరిహారానికే యేసుక్రీస్తు జన్మించాడు..*
*క్రిస్మన్ వేడుకల్లో పాస్టర్ జయరాజ్..*

**యాడికి, డిసెంబర్ 25:**
మానవాళి పాపాల పరిహారానికే యేసుక్రీస్తు ఈలోకానికి వచ్చాడని సి హెచ్ ఐ చర్చ్ పాస్టర్ దేవరాజ్ పేర్కొన్నారు. యాడికి మండలంలోని సి హెచ్ ఐ చర్చ్. అగాపే చర్చ్. తదితర గ్రామాలలోని చర్చిలలో యేసుక్రీస్తు పుట్టుకను స్మరించుకుంటూ బుధవారం అర్ధరాత్రి నుండి క్రైస్తవులు క్రిస్మన్ పండుగను భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ముస్తాబైన చర్చీల్లో వేకువజాము నుండే ప్రభువును కీర్తిస్తూ భక్తిగీతాలను ఆలపిస్తూ ప్రార్థనలు చేశారు. క్రైస్తవులంతా ఒకరికొకరు క్రిస్మన్ శుభాకాంక్షలను తెలుపుకుని పండుగను సంతోషంగా జరుపుకోవటంతో చర్చీలన్నీ కిటకిటలాడాయి. ఈసందర్బంగా పాస్టర్ దేవరాజ్ మాట్లాడుతూ లోకాన్ని రక్షించటానికి మరణాన్ని సైతం జయించి తిరిగి జన్మించిన యేసుక్రీస్తును మనందరం స్తుతిస్తూ ఆయన యందు విశ్వాసాన్ని ఉంచాలని హితబోధ చేశారు. క్రిస్మన్ పండుగ విశిష్టతను వివరించారు. క్రిస్మన్ శుభదినాన ప్రజలంతా సంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తూ క్రిస్మన్ శుభాకాంక్షలు తెలియజేశారు.


యాడికి సిహెచ్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ దేవరాజ్


లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన టీడీపీ నాయకులు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**ఆత్మకూరు, డిసెంబర్ 25:**
మండలంలోని బి. యాలేరు గ్రామానికి చెందిన హరిజన ఈశ్వరయ్య కొడుకు హరిజన జీవన్ కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆసుపత్రి లో చికిత్స పొంది మరణించారు. వారికీ ముఖ్యమంత్రి సహాయ నిది కింద రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ గురువారం వారికీ 4.5.582 నాలుగు లక్షల అయిదు వేల అయిదు వందల ఎనబై రెండు రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేశారు. ఆత్మకూరు గ్రామానికి చెందిన వై.గీత లక్ష్మి కుటుంబానికి 1,62000 రూపాయలు, వడ్డిపల్లి గ్రామానికి చెందిన యనమల సరోజమ్మ కుటుంబానికి చెందిన 20.000రూపాయలు,సనప గ్రామానికి చెందిన హెచ్ . పెద్దన్న కుటుంబానికి 30.541రూపాయలు,మదిగుబ్బ గ్రామానికి చెందిన కృష్ణమ్మ కుటుంబానికి 51.507 రూపాయలు చెక్కులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వడ్డే నాగేంద్ర, మాజీ కన్వీనర్ పలమాసి సూరి, సనప రఘునాథ్ రెడ్డి, నాయీబ్రాహ్మణ ఆనంద్, కర్రవుల పెద్దన్న, ఇడిగ ఈశ్వరయ్య, మొద్దు రామాంజినేయులు ఎడి . ఈశ్వరయ్య, దాసరి అనిల్, అవిలిగొండ మధు, జోగి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


క్రిస్మన్ పండుగ విశిష్టతను వివరిస్తున్న పాస్టర్ వందనంబాబు.

## మానవాళి పాప పరిహారానికే యేసుక్రీస్తు జన్మించాడు

*క్రిస్మన్ వేడుకల్లో పాస్టర్ వందనంబాబు ..*

**పామిడి, డిసెంబర్ 25:**
మానవాళి పాప పరిహారానికే యేసుక్రీస్తు ఈలోకానికి వచ్చాడని పాస్టర్ వందనంబాబు పేర్కొన్నారు. యేసుక్రీస్తు పుట్టుకను స్మరించుకుంటూ గురువారం క్రైస్తవులు క్రిస్మన్ పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ముస్తాబైన చర్చీల్లో వేకువజాము నుండే ప్రభువును కీర్తిస్తూ భక్తిగీతాలను ఆలపిస్తూ ప్రార్థనలు చేశారు. క్రైస్తవులంతా ఒకరికొకరు క్రిస్మన్ శుభాకాంక్షలను తెలుపుకుని పండుగను సంతోషంగా జరుపుకోవటంతో చర్చీలన్నీ కిటకిటలాడాయి. ఈసందర్బంగా పాస్టర్ వందనంబాబు మాట్లడుతూ లోకాన్ని రక్షించటానికి మరణాన్ని సైతం జయించి తిరిగి జన్మించిన యేసుక్రీస్తును మనందరం స్తుతిస్తూ ఆయన యందు విశ్వసాన్ని ఉంచాలని హితబోధ చేశారు. క్రిస్మన్ పండుగ విశిష్టతను వివరించారు. క్రిస్మన్ శుభదినాన ప్రజలంతా సంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తూ క్రిస్మన్ శుభాకాంక్షలను తెలియజేశారు.

## కోన రామలింగేశ్వర స్వామి ఆలయం హుండీ డబ్బులు చోరీ

**యాడికి, డిసెంబర్ 25 :**
యాడికి వంటల పరిధిలోని కోన రామలింగేశ్వర స్వామి ఆలయంలోని హుండీ డబ్బులను గుర్తుతెలి దొంగలు దోచుకున్నట్లు ఆలయ పూజారి పోలీసులకు సమాచారం తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై వెంకటరమణయ్య పోలీస్ సిబ్బందితో ఆలయం వద్ద చేరుకొని విచారణ చేశారు బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు కోన పుణ్యక్షేత్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలోని తలుపులను పగలుగొట్టి అందులో ఉన్న స్వామివారి హుండీ పగలు కొట్టే ప్రయత్నం చేసిన పగలకపోవడంతో రాడ్డుతో మెండి వాటిలోని డబ్బులు తీసుకొని పోయినట్లు ఎస్సై వెంకటరమణకు తెలిపారు. వీటిపై పరిశీలించి విచారణ చేపడతామన్నారు.


కోన రామలింగేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్సై వెంకటరమణ

## కులాల వారీగా విడిపోకుండా ఐక్యతతో ముందుకు సాగాలి

### కళ్యాణ స్వామీజీ.. కనేకల్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం..

**కనేకల్, డిసెంబర్ 25:**
భారతదేశ పరిస్థితుల్లో హిందూ సమాజం కులాల వారీగా విడిపోకుండా ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతగానో ఉందని కళ్యాణ స్వామీజీ పేర్కొన్నారు. కనేకల్ పట్టణంలో హిందూ సమాజ ఐక్యతను చాటిచెప్పేలా హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో గురువారం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా సాగింది. హిందూ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా కళ్యాణ స్వామీజీ హాజరై ప్రత్యేక ప్రసంగం చేశారు. కార్యక్రమానికి లక్ష్మణ్ జీ అధ్యక్షత వహించగా, అయోధ్య రామిరెడ్డి వేదికను అలంకరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభలో కళ్యాణ స్వామీజీ వారు మాట్లాడుతూ కులాన్ని ఇంటి గడప వరకే పరిమితం చేసి, సమాజంలో


హాజరైన ప్రజలు



కార్యక్రమంలో పాల్గొన్న గురూజీ ప్రముఖులు

మనమంతా హిందువులమే అన్న భావనతో జీవించాలని పిలుపునిచ్చారు."మనమంతా హిందువులం మనమంతా బంధువులం" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. ఐకమత్యంతో ముందుకు సాగితేనే హిందూ సమాజానికి బలమూ, గౌరవమూ పెరుగుతాయని ఆయన తన సందేశంలో తెలిపారు.

హిందూ సమ్మేళన సమితి నాయకులు మాట్లాడుతూ కనేకల్ మండల పరిధిలోని హిందూ బంధువులు సకుటుంబ సపరివారంగా ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని హిందూ సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఇలాంటి సమావేశాలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అయోధ్య రామిరెడ్డి, వేలూరు మరియప్ప, హనుమాపురం జయరాం చౌదరి, మాల్యం శరభన్నగూడ, కనేకల్ ముత్తుస్వామి తదితర ప్రముఖులు పాల్గొని తమ సందేశాలతో సభను ఉద్దేశించారు. అలాగే హిందూ సమ్మేళన సమితి సభ్యులు, స్థానిక హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కనేకల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**కణేకల్, డిసెంబర్ 25 :**
కనేకల్ సీయోను ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాల్యం కలేకుర్తి గంగలాపురం మారంపల్లి కొత్తపల్లి బ్రహ్మసముద్రం ఉడేగోళం తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.24 తేదీన రాత్రి పిల్లలు ఆటపాటలతో వచ్చిన విశ్వాసులను అలరింపజేశారు. క్రీస్తును నమ్ముకున్న వారు ఏ విధంగా జీవించాలో అని నాటిక ద్వారా పిల్లలు ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా ఉదయం ప్రార్థన కూడికలో చర్చి పాస్టర్ అయినటువంటి రెవరెండ్ సాకే మత్తయి


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న భక్తులు


క్రిస్మస్ సందేశాన్ని భక్తులకు వినిపిస్తున్న ఫాదర్ మత్తయ్య

క్రిస్మస్ సందేశం అందించారు. అనంతరం రెవరెండ్ సాకే ప్రసాద్ వాక్యోపదేశం చేశారు, ఇందులో భాగంగా ఏసుక్రీస్తు పాపులను ప్రేమించి రక్షించాడు అనే సందేశాన్ని బోధించారు. అనంతరం పిల్లలకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు.అనాధలు అయినటువంటి మహిళలకు వృద్ధులకు చీరల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవరెండ్ సాకే డేవిడ్ మరియు స్థానిక సంఘ కమిటీ సభ్యులు, పిల్లలు పెద్దలు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. వచ్చిన విశ్వాసులందరికి కూడా ప్రేమ విందును ఏర్పాటు చేశారు చర్చి వారు.

## ఘనంగా వాజ్‌పేయి శత జయంతి వేడుకలు

### జాతీయ సుపరిపాలనా దినోత్సవం..

**తాడిపత్రి, డిసెంబర్ 25:**
భారతీయ జనతా పార్టీ తాడిపత్రి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భారతరత్న, భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రజక వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రజక వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ భారతరత్న, భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి సందర్భంగా అందరికి సుపరిపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పూర్వపు గ్వాలియర్ రాజ్యం నేటి మధ్యప్‌దేశ్ రాష్ట్రంలో 1924 డిసెంబర్ 25 వాజ్‌పేయి ఉపాధ్యాయ కుటుంబంలో జన్మించారని తెలిపారు. తన రాజకీయ ఎదుగుదలకు, భారత ప్రజాస్వామ్య వికాసానికి దోహదపడే విధంగా వాజ్‌పేయి ప్రజా జీవనం సాగిందన్నారు. దశాబ్దాలపాటు ప్రపంచం పట్ల ఉదార వైఖరి, ప్రజాస్వామ్య సిద్ధాంతాల పట్ల అంకితభావం వాజ్‌పేయిను అసాధారణ నాయకునిగా నిలబెట్టాయన్నారు. మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం పాటుపడిన వాజ్‌పేయి ముందు చూపునే విశ్వసించేవారన్నారు.

భారతీయ జనతా పార్టీలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రజలలో నుంచి వచ్చిన మనిషిగా, రాజకీయ దృఢ సంకల్పం కలిగిన నేతయని కొనియాడారు. అటల్ బిహారీ వాజ్‌పేయి 1999న అక్టోబర్ 13న రెండవ పర్యాయం భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టి కొత్త సంకీర్ణ ప్రభుత్వం నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్‌కు నాయకత్వం వహించారని తెలిపారు. మొదట 1966లో దేశ ప్రధానిగా ఉన్నారని, సీనియర్ పార్లమెంటేరియన్‌గా నాలుగు దశాబ్దాలపాటు వాజ్‌పేయి జీవితం సాగిందన్నారు. వాజ్‌పేయి లోక్‌సభకు తొమ్మిదిసార్లు, రాజ్యసభకు రెండుసార్లు ఎన్నికై రికార్డు నెలకొల్పారన్నారు.

భారత ప్రధానిగా, విదేశాంగ మంత్రిగా, పార్లమెంట్‌కు చెందిన వివిధ ముఖ్యమైన స్థాయి సంఘాలకు ఛైర్ పర్సన్‌గా, స్వాతంత్రానంతర భారత దేశీయ, విదేశాంగ విధానానికి ఒక సమగ్రమైన, స్పష్టమైన, అర్థవంతమైన రూపాన్ని ఇవ్వడంలో వాజ్‌పేయి క్రియాశీలక పాత్ర పోషించారన్నారు.

విద్యార్థి దశలోనే వాజ్‌పేయి జాతీయ రాజకీయాల్లో ప్రవేశించారాని, 1942లో బ్రిటీష్ వలస పాలన అంతానికి దారితీసిన క్విట్ ఇండియా ఉద్యమంలో వాజ్‌పేయి పాల్గొన్నారన్నారు. పొలిటికల్ సైన్స్, లా విద్యార్థిగా వాజ్‌పేయి కళాశాల స్థాయిలోనే విదేశీ వ్యవహారాలపై ఆసక్తి పెంచుకున్నారని, అలా ఏళ్ళ తరబడి పెంచుకున్న ఆసక్తిని, వివిధ వేదికలపై భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన సందర్భాల్లో నేర్పుగా, చాకచక్యంగా ప్రదర్శించారన్నారు.

తొలుత పాత్రికేయ వృత్తిలో ప్రవేశించిన వాజ్‌పేయి 1951లో భారతీయ జనసంఘ్‌లో చేరడంతో దానిని అర్థంతరంగా ముగించారని, భారతీయ


నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు


వాజ్ పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న రామాంజనేయులు

జనసంఘ్ ఆ తరువాత రూపాంతరం చెంది నేటి భారతీయ జనతా పార్టీగా ఆవిర్భవించిందన్నారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్‌కు నాయకత్వ బాధ్యతలు వహించి, విమర్శనాత్మక కవిగా వాజ్‌పేయి పేరుగాంచారని తెలిపారు. ఇండియాను ముందుకు తీసుకువెళ్ళాలనే తపన పడేవారని, భారత్‌ను ప్రపంచ దేశాల సరసన శక్తివంతమైన, సౌభాగ్యవంతమైన దేశంగా నిలబెట్టాలని ఆరాటపడేవారన్నారు. 5వేల సంవత్సరాల నాటి నాగరిక చరిత్ర నుంచి వచ్చే వెయ్యేళ్ళలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనే స్థాయికి భారత్‌ను ఆధునీకరించడం, శక్తివంతంగా చేయడమే లక్ష్యంగా వాజ్‌పేయి ఆలోచనలు, విధానాలు సాగేవన్నారు. తాను అమితంగా ప్రేమించే భారతదేశం పట్ల వాజ్‌పేయి నిస్వార్థ అంకితభావానికి, అర్థ శతాబ్దంపాటు సమాజానికి, దేశానికి వాజ్‌పేయి అందించిన సేవలకు గుర్తింపుగా భారత రెండవ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్‌ను వాజ్‌పేయి అందుకున్నారని తెలిపారు. 1994లో ఆయన ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డుకు ఎంపికయ్యారని, ఈ పురస్కార ప్రశంసా పత్రంలో పేరుకు తగ్గట్టుగానే అటల్‌జీ ప్రముఖ జాతీయ నాయకుడు, నిష్కలంక రాజకీయవేత్త, నిస్వార్థ సంఘ సేవకుడు, శ్రోతలను కట్టిపడేసే మహోపన్యాసకుడు, కవి, సాహితీవేత్త, జర్నలిస్ట్ ఇంకా బహుముఖ ప్రజ్ఞాశాలియని, అటల్‌జీ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమని, వాజ్‌పేయి సేవలు, జాతీయత పట్ల పూర్తి నిబద్ధతకు నిండు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను స్మరిస్తూ శతజయంతి వేడుకలు నిర్వహించడం తన అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు సింగరి లక్ష్మీనారాయణ రంగనాథ్ రెడ్డి, రంగనాయకులు, ఓబిరెడ్డి సురేష్, బీమా, వెంకట సుబ్బయ్య, జమాల్, వీరభద్ర, నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, బీజేపీ మహిళా నేతలు విజయలక్ష్మి, అమరవాణి పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి, డిసెంబర్ 25:
క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని గురువారం క్రైస్తవ సోదరుల నడుమ మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అయిన క్రిస్మస్ పండుగను అందరూ ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆరోగ్యం, శుభఫలితాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం కేతిరెడ్డి పెద్దారెడ్డి క్రైస్తవ సోదరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు.


వైకాపా నేత సూర్యతేజరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

## సూర్య తేజరెడ్డికి పరామర్శ

*మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి*

**తాడిపత్రి, డిసెంబర్ 25:**
తెలుగుదేశం పార్టీ గుండాల దాడిలో గాయపడిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సూర్య తేజరెడ్డిని గురువారం మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. అనంతపురం పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వైకాపా నేత సూర్య తేజరెడ్డిని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించి, వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## పెద్దపప్పూరు ఎస్సైగా చంద్రశేఖర్ రెడ్డి

**తాడిపత్రి, డిసెంబర్ 25:**
తాడిపత్రి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్ ఎస్సైగా గురువారం చంద్రశేఖర్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై నాగేంద్ర ప్రసాద్ బదిలీ పై నంద్యాల జిల్లాకు వెళ్లారు.


పెద్ద పప్పూరు ఎస్ఐగా బాధ్యతలు


భూగర్భ డ్రైనేజీ పైపులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

## భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

*ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి..*

**తాడిపత్రి, డిసెంబర్ 25:**
తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామం నందు గురువారం శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం భూగర్భ డ్రైనేజీ పనుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆవిష్కరించారు. భూగర్భ డ్రైనేజీ పనులకు ఉపయోగించే పైపులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సజ్జలదిన్నె గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి**
క్రిస్మస్ పర్వదినాన్ని పునస్కరించుకొని శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి సుంకులమ్మ పాలెంలోని సిఎస్ఐ చర్చి నందు ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.


సిఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

# అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు

## 12 తులాల బంగారం స్వాధీనం.. ముగ్గురు నిందితులతో పాటు ముగ్గురు మైనర్ల అరెస్ట్.. ఈ కేసులో సీసీ కెమెరాలు కీలకం.. ధర్మవరం డిఎస్పీ హేమంత్ కుమార్..

బత్తలపల్లి, డిసెంబర్ 25:
జన సంచారం ఉన్న ప్రాంతంలో అమాయక మహిళలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠాను పట్టుకొని వారి వద్ద నుండి 8లక్షల విలువచేసే 12 తులాల బంగారంను స్వాధీనం చేసినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. గురువారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్, ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ వివరాలు వెల్లడించారు. ఈనెల 23వ తేదీన బత్తలపల్లి మండలం కాటంకుంట గ్రామానికి చెందిన దొడ్డావుల ఆదిలక్ష్మి బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ధర్మవరం వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్నా ఆమె బ్యాగులో నుంచి నాలుగు తులాల బకారులైన దొంగలించారన్నారు. ఈ కేసులో విచారణలో భాగంగా


బత్తలపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు నగలు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి హేమంత్ కుమార్

ధర్మవరం రూరల్ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్, తాడిమర్రి ఎస్సై కృష్ణవేణి లు తమ సిబ్బందితో ప్రత్యేక టీం ఏర్పాటు చేసుకొని విచారణ చేపట్టాలన్నారు. కూడలిలో సిసి కెమెరాలను పరిశీలించి అనానాస్పద వ్యక్తులపై ఆరా తీశారన్నారు. చివరకు ఉమ్మడి కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన కోటయ్య, పిలిషా, శాంతి అనే నిందితులతో పాటు, చట్టంతో సంఘర్షణలో ఉన్న ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో తాడిపత్రి రోడ్డులో బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగులో నుంచి నాలుగు తులాల నాలుగు బంగారు గాజులు, ఈనెల 12వ తారీకున ధర్మవరం నుండి అనంతపురం వెళ్ళు బస్సులో ఒక మహిళ హ్యాండ్ బ్యాగ్ లో నుంచి దొంగలించినట్లు నేరం అంగీకరించారన్నారు. వారి నుండి దొంగలించిన ఒక బంగారు చైను, ఒక బంగారం ఉంగరము, ఒక జత బంగారు కమ్మలు, ఒక బంగారు డాలరు, నాలుగు బంగారు గాజులు, నల్ల చైనా స్వాధీనం చేసుకున్నారు. వీటిని కదిరిలో అమ్మడానికి వెళుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బత్తలపల్లి లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. అందువలన సీసీ కెమెరాలపై ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలన్నారు.కేసును చేదించిన సీఐ ప్రభాకర్, ఎస్సై సోమశేఖర్ల తోపాటు కానిస్టేబుల్ సుదర్శన్ నాయుడు, అనిల్ కుమార్, నాగార్జున, హెూంగార్డు ఇస్మాలను డిఎస్పి అభినందించారు.

# మోటార్ మెకానిక్ దుకాణంలో చోరీ

బత్తలపల్లి, డిసెంబర్ 25 :
మండల కేంద్రంలోని అనంతపురం రోడ్డులో ఉన్న మోటార్ల మెకానిక్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు దాసరి సాయి సతీష్ (మాధవయ్య చిట్టి) తెలిపిన వివరాల మేరకు.. బత్తలపల్లిలోని అనంతపురం రోడ్డుకు గత మూడు సంవత్సరాలుగా మెకానిక్ దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. యధావిధిగా బుధవారం పనులు ముగించుకుని దుకాణానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. గురువారం దుకాణం తలుపులు తెరవడానికి వెళ్లగా అప్పటికే తలుపుల కీళ్లు పగులుకొట్టినారు. దుకాణంలో మోటార్లు మరమ్మత్తులకు తెచ్చిన రూ.30వేల విలువైన కొత్త వైరు, పాత వైరు, గన్ మెటల్ను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాదితుడు తెలిపారు. ఇప్పటివరకు తన షాప్ లో మూడుసార్లు చోరీ జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుకాణంను పోలీసులు పరిశీలించారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

గుడిబండ, డిసెంబర్ 25:
గుడిబండ ఒరే బో ప్రార్థన కేంద్రం నందు గురువారం క్రిస్టియన్లు ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జన్మదిన పురస్కరించుకొని ప్రార్థన మందిరంలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఏసుప్రభు లీల వారి విశిష్టతను ప్రేమ అనురాగాలు శాంతి వంటివి పాటల ద్వారా ప్రతినిధులు వివరించి ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సుదర్శన్ సిద్దేశ్, శ్రీరామ్ రెడ్డి స్టీఫెన్, డేవిడ్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు



ప్రార్థన నిర్వహిస్తున్న దృశ్యం

## విబి-జి-ఆర్ఏఎం-జి గ్రామ సభలు వాయిదా

బత్తలపల్లి, డిసెంబర్ 25:
మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నిర్వహించాల్సిన విబి-జి-ఆర్ఏఎం-జి గ్రామసభలు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు ఇంచార్జ్ ఏపీవో అశోక్ కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాల్సి ఉండగా సిఆర్డి నుండి అధికారక సమాచారం రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు గమనించాలని కోరారు.

# ఎస్ఐ గౌతమికి సన్మానం

రొళ్ల, డిసెంబర్ 25 :
ఎస్ఐగా బాధ్యతులు చేపట్టిన గౌతమిని గురువారం మండల తెదేపా నాయుకులు ఎస్ ఐ ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు క్రిష్ణమూర్తి, డీలర్ల సంఘం ఉపాధ్యక్షులు నారాయణప్ప, రొళ్ళ పంచాయితీ కన్వీనర్ తూబినకుంట నాగేంద్ర బూత్ ఇంచార్జ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐ గౌతమిని సన్మానించిన టిడిపి నాయకులు

# నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ధర్మవరం డిఎస్పీ హేమంత్ కుమార్..

బత్తలపల్లి, డిసెంబర్ 25 :
మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల సరళి మారుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి నేర రహిత సమాజ స్థాపనకు పోలీసులకు సహకరించాలని ధర్మారం డిఎస్పి హేమంత్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామంలో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఎస్సై సోమశేఖర్ తో కలిసి ఆయన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు,చోరీలు, అపరిచిత వ్యక్తుల కదలికల పట్ల గ్రామస్తులు నిఘా ఉంచాలన్నారు. ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాల నియంత్రణతో పాటు, నిందితులను పట్టుకోవడం సులభతరమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ధర్మవరం డిఎస్పీ హేమంత్ కుమార్

# ఎంఇఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు ఘన సన్మానం

రోళ్ల, డిసెంబర్ 25 :
మడకశిర పట్టణంలోని రోడ్లు భవనాల విశ్రాంతి భవనంలో గురువారం శ్రీ సత్యసాయి జిల్లా మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా సమావేశం కే భూతన్న ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ నాగేంద్ర నాథ్ మౌర్య, పోతలయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆశయ సాధన కోసం, ఆది జాంబవ భావన నిర్మాణం కోసం, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నిర్మాణం కోసం ప్రతి మాదిగ ఉద్యోగి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తదనంతరం మాదిగ ఉద్యోగులందరూ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుసూదన్ సాకే, ఎం ఇ ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జి. ఆనంద్, రాష్ట్ర కార్యదర్శులు శివకుమార్, శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు వి.ఎన్. మాలింగప్ప, కే. రంగస్వామి, ఉలవల నాగరాజు , రామక్రిష్ణ ,శ్రీనివాసులు సత్యసాయి జిల్లాలోని అన్ని తాలూకాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


సమావేశమైన ఎంఇఎఫ్ నాయకులు


జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ఎంఎస్ రాజును సన్మానించిన ఎంఐఎఫ్ నాయకులు

# ఘనంగా వాజపేయి జయంతి వేడుకలు

## బిజెపి మండల అధ్యక్షురాలు హెచ్ కె విక్టోరియా మహారాణి..

అగళి, డిసెంబర్ 25:
రాజకీయాల్లో అపార అనుభవం గడించిన అటల్ బిహారీ వాజపేయి మంచిపరిపాలనాధ్యక్షుడిగా ఖ్యాతిని పొందిన అటల్ బిహారీ వాజపేయి మహానుభావుడని బిజేపి అగళి మండల అధ్యక్షురాలు హెచ్ కె విక్టోరియా మహారాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలో భారత మాజీ ప్రదానమంత్రి అటల్ బిహారీ వాజపేయి జయంతోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం మండల అధ్యక్షురాలి తో పాటు బిజెపి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాల్లో అపార అనుభవం గడించిన అటల్ బిహారీ వాజపేయి రాజకీయ ఉద్దండుడుగా గుర్తింపును పొందారని తెలిపారు.బిజెపి వ్యవస్థాపక అధ్యక్షులుగా పార్టీని దేశవ్యాప్తంగా విస్తరింపజేసిన అటల్ బిహారీ వాజపేయి ప్రధానమంత్రిగా ప్రజాభ్యున్నతికి పాటుపడుతూ తన


వాజ్ పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిజెపి మండల అధ్యక్షురాలు విక్టోరియా మహారాణి


వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మండల నాయకులు

రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ దేశానికి అందించిన సేవలు రాజకీయాలకే వన్నె తెచ్చాయని కొనియాడారు.దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తించి 2015లో భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించగా అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్వయంగా అటల్ బిహారీ వాజపేయి ఇంటికెళ్ళి ప్రదానం చేయటం గర్వించదగ్గ విషయం అని తెలియజేశారు. రాజకీయ కోవిదుడు బహుముఖ ప్రజ్ఞాశాలి అటల్ బిహారీ వాజపేయి బౌతికంగా దూరం అయినప్పటికీ మనందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహెూన్నతుడు అన్నారు. అనంతరం అటల్ బిహారీ వాజ్ పేయి పేరున తయారు చేయించిన కేకును కట్ చేసిన బిజేపి నాయకులు పలువురికి పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షురాలు హెచ్ కె విక్టోరియా మహారాణి, సీనియర్ నాయకులు ఎన్ కె ఈరచిక్కప్ప,విశ్రాంత ఆర్మీ జవాన్ మధూడి కల్లప్ప, మాజీ సర్పంచ్ రవికుమార్,తాండ ఆనంద్, దొడ్డ రంగేగౌడ్, కృష్ణప్ప, శోభ, ఉల్లేకెర తిమ్మప్ప, టైలర్ మంజునాథ్, మధూడి దేవరాజు,అగళి మంజునాథ్ దితరులు పాల్గొన్నారు.

# హలకూరు కాంతరాజు జన్మదిన వేడుకలు

రోళ్ల, డిసెంబర్ 25 :
బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు హలకూరు కాంతరాజు జన్మదిన వేడుకలను గురువారం మండలకేంద్రంలో అయన అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. తోలుతా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఇలాంటి జన్మదిన వేడుకలు వందేళ్లు జరుపుకోవాలని రాజకీయంంగా మరింత ఉన్నతస్థాయికి ఎదిగి ప్రజలకు సేవా చేసే భాగ్యం కల్పించాలని కోరారు.ఈకార్యక్రమంలో అయన అభిమానులు రామక్రిష్ణ, సర్పంచ్ ప్రకాష్,భోజప్ప, కరేగౌడ్,రామన్న, భూతేగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న హలకూరు కాంతరాజు అభిమానులు


కదిరి బలిజ సంఘం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

# 100 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

## రూ.35.56 లక్షల విలువ చేసే చెక్కులు పంపిణీ ఎమ్మెల్యే రాజు..

అగళి/మడకశిర డిసెంబర్ 25 :
మడకశిర నియోజకవర్గానికి చెందిన 100 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మడకశిర శాసనసభ్యులు టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మడకశిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అందించారు. వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ,ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అందరికీ ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు చేసిన కృషి ఫలితంగా 100మందికి రూ.35,56,392విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి, పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతి పేదవారికి ఉచిత వైద్యం అందాలి, ప్రతి పేదవారి ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందాలి, ఆపదలో ప్రతి కుటుంబాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకోవాలని అనే బలమైన సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది.గత వైసీపీ ప్రభుత్వం ఈ విధంగా పేదవారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. పేదవారి ఆరోగ్యాన్ని, ఆపదలో ఉన్న పేదవారిని గాలికొదిలేశారు. కేవలం వైసీపీ నేతలు ప్రజాధనాన్ని కొల్లగొట్టి జేబుల్లో కోట్లు నింపుకోవడం,తాడేపల్లి ప్యాలెస్ కు కమీషన్లను పంపించడమే లక్ష్యంగా పనిచేశారు.ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి పూర్తిగా మంగళం పాడేశారు.అది ఇచ్చాం, ఇది ఇచ్చాం అని చెప్పడమే తప్ప....వైసీపీ పాలనలో పేదవారికి జరిగిన మేలు ఏమీ లేదు. అప్పుచేసి పప్పు బెల్లాలు పంచి...విపరీతమైన ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టిన వైసీపీకి 2024 ఎన్నికల్లో ప్రజలే తగిని బుద్ధి చెప్పారు. కనీసం ప్రతిపక్ష హెూదాకు కూడా నోచుకోకుండా చావుదెబ్బ కొట్టినంత పని చేశారు.కూటమి ప్రభుత్వం పేదవారిని ఆదుకోవడంతో పాటు అభివృద్ధి - సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా ముందుకు నడుపుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సీఎంఆర్ ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, గుండుమల తిప్పేస్వామి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందుకున్న అగళి మండలం మహిళ


సీఎంఆర్ఎఫ్ చెక్కులను వందలాది మందికి అందిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# అగళి న్యూకోవినెంట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

## పేదలకు వస్త్ర అన్నదానం.. సిస్టర్ ప్రతిభ..


అగళి, డిసెంబర్ 25:
మానవాళి పాప పరిహారానికే యేసుక్రీస్తు ఈలోకానికి వచ్చాడని పాస్టర్ ప్రతిభ పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని న్యూ కోవినెంట్ చర్చిలో సిస్టర్ ప్రతిభ ఆధ్వర్యంలో యేసుక్రీస్తు పుట్టుకను స్మరించుకుంటూ గురువారం క్రైస్తవులు క్రిస్మస్ పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ముస్తాబైన చర్చీల్లో వేకువజాము నుండే ప్రభువును కీర్తిస్తూ భక్తిగీతాలను ఆలపిస్తూ ప్రార్ధనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుంటూ క్రైస్తవులంతా ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలను తెలుపుకుని పండుగను సంతోషంగా జరుపుకోవటంతో అగళి గ్రామంలోని న్యూ కోవినంట్ చర్చీ కిటకిటలాడింది. ఈసందర్భంగా శిస్టర్ ప్రతిభ మాట్లడుతూ కరుణ ప్రేమ క్షమా పత్రత్వం త్యాగం ఇవన్నీ జీవితంలో మానవాళికి క్రీస్తు లోకాన్ని రక్షించటానికి మరణాన్ని సైతం జయించి తిరిగి జన్మించిన యేసుక్రీస్తును మనందరం స్తుతిస్తూ ఆయన యందు విశ్వసాన్ని ఉంచాలని హితబోధ చేశారు.క్రిస్మస్ పండుగ విశిష్టతను వివరించారు.క్రిస్మస్ శుభదినాన ప్రజలంతా సంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు.ఈ సందర్భంగా సిస్టర్ ప్రతిభ దాదాపు 100 మంది పేద క్రైస్తవులకు చీరలు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం చేసారు.ఈ సందర్భంగా ఏసుప్రభు బిడ్డలు తదితరులు పాల్గొన్నారు.


పేద క్రైస్తవులకు చీరలు, దుస్తులు పంపిణీ చేస్తున్న సిస్టర్ ప్రతిభ



హిత బోధనలు చేస్తున్న సిస్టర్ ప్రతిభ. చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

# టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోడిగుడ్ల ఏసేపు



**పెద్దకడబూరు, డిసెంబర్ 25 :** కర్నూలు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్దకడబూరు గ్రామానికి చెందిన కోడిగుడ్ల ఏసేపు నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను టీడీపీ కేంద్ర పార్టీ కార్యాలయం విడుదల చేసింది. ఈ సందర్భంగా గురువారం కోడిగుడ్ల ఏసేపు మాట్లాడుతూ తనపై నమ్మకంతో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గంలోను ముఖ్యంగా పెద్దకడబూరు మండలంలో టీడీపీ బలోపేతానికి సైనికుల్లా పని చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజల్లో ఎండగడతానన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కోడిగుడ్ల ఏసేపుకు మండలంలోని వివిధ గ్రామాలలోని టీడీపీ నాయకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. టీడీపీలో సీనియర్ నాయకులుగా ఉన్న కోడిగుడ్ల ఏసేపుకు పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

# రెడ్డి సంక్షేమ సంఘం మండల కన్వీనర్‌గా సుధాకర్ రెడ్డి యువజన విభాగం మండల కన్వీనర్‌గా సురేష్ రెడ్డి





**పెద్దకడబూరు, డిసెంబర్ 25 :** ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం పెద్దకడబూరు మండల కన్వీనర్‌గా సుధాకర్ రెడ్డి నియమితులయ్యారు. అలాగే ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం యువజన విభాగం మండల కన్వీనర్ గా ఎం. సురేష్ రెడ్డి ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను గురువారం కర్నూలులో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిర్రు ప్రతాప్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం మండల కన్వీనర్ గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు బిర్రు ప్రతాప్ రెడ్డి, ఇతర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. రెడ్ల సంక్షేమానికి ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతామని స్పష్టం చేశారు.



కాంతారా సినిమా హీరో రిశబ్‌శెట్టికి రాఘవేంద్రుని చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న హీరో రిశబ్‌శెట్టి

**ఆదోని డిసెంబర్ 25:** కాంతారా సినిమా హీరో రిషిప్ శెట్టి తన కుటుంబ సభ్యులతో గురువారం రోజు రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు వారికి పాద పూజ చేశారు. పీఠాధిపతి వారికి పరిమళ ప్రసాదం అందజేశారు. ఆ తర్వాత చిత్రపటాన్ని అందజేశారు.



పాద పూజ చేస్తున్న రిశబ్‌శెట్టి దంపతులు పీఠాధిపతులు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

# అమరావతి వరద నివారణ ఒలక బోసి ఎత్తుకోవడమే!



ఒకవైపు ప్రాజెక్టులు నిండక,హక్కుగా రావాల్సిన నీళ్లు రాక,రాయలసీమ గొంతు ఎండిపోతుంటే,మరోవైపు రాజధాని అమరావతిని ముంపు బారి నుండి కాపాడడానికి వరద నీటిని మళ్లించడానికి 443.76 కోట్ల రూపాయలు ఖర్చు చేయడమే బాబు విజన్. అమరావతిని వరదల నుండి కాపాడడానికి పాలవాగు గ్రావిటీ కెనాల్స్, కొండవీటి వాగు,బుగ్గ వంక తో పాటు ఆరు రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు.ఇవి కాకుండా అధికంగా వచ్చే మరో 22,500 క్యూసెక్కుల నీటిని బయటకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నారు.ఇందులో భాగంగా గుంటూరు ఛానల్ ద్వారా 4000 క్యూసెక్కులు, ఉండవల్లిలో మరో ఎత్తిపోతల ద్వారా 8400 క్యూసెక్కులు తరలిస్తున్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ రాయలసీమ ప్రాంతంలో ఉన్న తుంగభద్ర,కృష్ణా నదులపై రాయలసీమ తెలంగాణ ప్రాంతాలలో ప్రాజెక్టులు నిర్మించడం వల్ల పై భాగంలోని నీటిని పై భాగంలోనే నిలిపి వేయడం ద్వారా,పులిచింతల ప్రాజెక్టు కింద బాగంలో కృష్ణానదికి పూర్తిగా వరదను నిలుపుదల చేసి,అమరావతిని ముంపు నుండి కాపాడవచ్చు. అలా చేయకుండా,కనీస పరిజ్ఞానం లేకుండా కాంట్రాక్టుల కక్కుర్తి కోసం,గతంలో రాజధానికి సేకరించిన 50వేల ఎకరాల భూమిని కాదని మరోసారి 44వేల ఎకరాలు సేకరిస్తూ,వరదలను బూచిగా చూపించి,రాజధాని నిర్మాణం చేపట్టి,అక్కడి రైతులకు న్యాయం చేయకుండ కాలయాపన చేస్తూ,వేల కోట్ల రూపాయలు అప్పులు తెస్తూ, ఎటువంటి ప్రణాళికలు లేకుండా,ఇలా రిజర్వాయర్ లు,ఎత్తిపోతల పథకాల పేరుతో ప్రజాధనాన్ని,నీటి పాలు చేస్తున్నారు.

రాయలసీమ ప్రాంతంలో తుంగభద్ర,కృష్ణా నదులపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ప్రాజెక్టులను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడం వల్ల అటు రాయలసీమ దాహార్తిని తీర్చవచ్చు ఇటు అమరావతి వరదలనునివారించడం వల్ల, ఉభయ కుశలంగా ఉంటుంది. అమరావతి వరదల నివారణకు పెడుతున్న ఖర్చుతో రాయలసీమ పశ్చిమ ప్రాంతంలో ఉన్న నదులను అనుసంధానం చేసి, రాయలసీమ ప్రాంత రైతాంగాన్ని కాపాడవచ్చు.

– కెవి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు,
"వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక" అనంతపురం.



సీఎస్ఐ చర్చిలో క్రిస్టమస్ సందేశమిస్తున్న పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు . సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డి. సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీడీపీ యువనేతలు

# లోక కల్యాణం నిమిత్తం పుట్టిన యేసుక్రీస్తు

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు ..

**పెద్దకడబూరు, డిసెంబర్ 25 :** లోక కల్యాణం నిమిత్తం యేసుక్రీస్తు మనుష్య కుమారునిగా పుట్టారని సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు, ఆర్సీఎం చర్చి ఫాదర్ రాజేంద్ర రెడ్డి సందేశమిచ్చారు. గురువారం పెద్దకడబూరు మండలంలోని హెచ్ మురవణి, కంబదహాల్, జాలవాడి, కంబళదిన్నె, కల్లుకుంట, చిన్నతుంబళం, బసలదొడ్డి, పెద్దకడబూరు గ్రామాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆయా గ్రామాలలోని క్రైస్తవులు భక్తి గీతాలతో పుర వీధుల గుండా భగవంతుని కుమారుడు మనుష్య రూపంలో కన్య మరియ గర్భాన పశువుల పాకలో లోక కల్యాణం నిమిత్తం అవతరించారని భజన కార్యక్రమం నిర్వహించారు. పెద్దకడబూరు గ్రామంలో సీఎస్ఐ, ఆర్సీఎం చర్చిల వద్ద ఏర్పాటు చేసిన పశువుల పాకలు, అందులోని క్రీస్తు జననం దృశ్యాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం పెద్దకడబూరులోని సీఎస్ఐ, ఆర్సీఎం చర్చిలలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు, ఫాదర్ రాజేంద్ర రెడ్డి క్రిస్మస్ సందేశమిచ్చారు. లోక కల్యాణం నిమిత్తం దేవుని కుమారుడు మనుష్య రూపంలో యేసుక్రీస్తుగా భూమిపై అవతరించడాన్ని క్రిస్మస్ గా జరుపుకుంటున్నామని తెలిపారు. యేసుక్రీస్తు కన్య మరియ గర్భాన బెత్లహేమ్ నందు పశువుల పాకలో జన్మించారని గుర్తు చేశారు. క్రీస్తు ఈ లోకంలో ముప్పై మూడున్నర సంవత్సరాల జీవించి మానవాళిని సన్మార్గంలో నడిపించారన్నారు. ప్రతి ఒక్కరూ దయ, కరుణ, జాలి, ప్రేమ, సోదరభావం వంటి లక్షణాలు కలిగి సత్ప్రవర్తనతో జీవించాలని క్రీస్తు ప్రభోదించారని తెలిపారు. యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి క్రీస్తు అడుగు జాడలలో నడవాలని కోరారు.

క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు

క్రిస్మస్ పండుగ సందర్భంగా పలువురు నాయకులు క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పెద్దకడబూరులోని ఆర్సీఎం, సీఎస్ఐ చర్చిలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, సొసైటీ ఛైర్మన్ మీ సేవ ఆంజనేయులు, బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున పాల్గొని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఆర్సీఎం చర్చి నిర్మాణానికి టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డి రూ. 50 వేలు విరాళం ప్రకటించారు. అలాగే టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షులు తిక్కారెడ్డి అనుచరులు టీడీపీ యువనేతలు ఇంద్రసేనా రెడ్డి, నీలకంఠ రెడ్డి, మబ్బు అంజినయ్య సీఎస్ఐ, ఆర్సీఎం చర్చిలలో జరిగిన ప్రార్థనలలో పాల్గొని క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బసలదొడ్డి గ్రామంలో ఆర్సీఎం చర్చిలో జరిగిన ప్రార్థన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గవిగట్టు ఈరన్న హాజరై క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. క్రీస్తు సూచిన గుణాలను అలవరచుకొని సన్మార్గంలో నడవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సెక్రటరీ రోగన్న, ట్రెజరరీ ప్రసాద్, సంఘ పెద్దలు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపు, టీడీపీ నాయకులు గుమ్మల ఆశన్న, గుమ్మల రాజేష్, యిమ్మానూయేల్, ఆదాం, సుధాకర్, వైసీపీ ప్రచార విభాగం తాలూకా అధ్యక్షులు ముక్కరన్న, వైసీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొగ్గుల అర్లప్ప, వైసీపీ నాయకులు కొరవ సుందరం, కుమార్, కుదే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ పండుగ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవ సోదరులు





ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక అలంకరణ దృశ్యం



ఆర్సీఎం చర్చిలో క్రిస్మస్ సందేశమిస్తున్న ఫాదర్ రాజేంద్ర రెడ్డి, ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డి . టీడీపీ యువనేత ఇంద్రసేనా రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

# మదనపల్లెలో మరో విద్యార్థినికి విద్యుత్ షాక్

**మదనపల్లె, డిసెంబర్ 25 :** అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో 4 వ తరగతి విద్యార్థిని మిద్దిమీద ఆడుకుంటూ ఉండగా గురువారం విద్యుత్ షాక్ గురై తీవ్రంగా గాయపడింది. ఆ వివారులు.. మదనపల్లి మండలంలోని జగన్ కాలనీలో ఉంటున్న దంపతులు ఆనంద శ్రావణిల కుమార్తె రెడ్డి ప్రసన్న (10) అదే వీధిలోని నిర్మలమ్మ ఇంటిపై సహచర పిల్లలతో కలిసి ఆడుకుంటు ఉంది. అదే సమయంలో మిద్దె పై వేలాడుతున్న11కేవి విద్యుత్ వైర్లు రెడ్డి ప్రసన్నకు తగలడంతో విద్యుత్ ఘాతం కు గురై తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, బాలిక పరిస్థితి విషమించడంతో వెంటనే తిరుపతి రియాకు వెళ్లాలని రెఫర్ చేశారు. కుటుంబీకులు బాలికను వెంటనే తిరుపతి రుయాకు తరలించారు. మదనపల్లె మండలంలో వరుస విద్యుత్ ప్రమాదాలు రోజు రోజుకు పెరిగి పోతున్నా.. ఉన్నతాధికారులు మీనమేశాలను లెక్కిస్తున్నారు.

# శ్రీశైల మల్లన్న అన్నప్రసాద పథకానికి విరాళం

**శ్రీశైలం, డిసెంబర్ 25:** శ్రీశైలం మహా క్షేత్రంలోని దేవస్థానం వారు నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద పథకానికి కె. సావిత్రమ్మ, నంద్యాల అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం రూ. 1,00,001 పథకానికి అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. శివప్రసాద్‌కు అందజేశాకె, దాతకు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందించి దాతను ప్రోత్సహించారు



అన్నప్రసాద పథకానికి విరాళం అందిస్తున్న భక్తులు

# యాడికిలో ఘనంగా సిపిఐ శతాబ్ది వేడుకలు

## త్యాగధనుల కుటుంబాలకు ఘన సన్మానం.. సి. జాఫర్ పి నారాయణ స్వామి..

**యాడికి, డిసెంబర్ 25 :** యాడికి మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీలో గురువారం అజయ్ బాబు, సిపిఐ మండల కార్యదర్శి మహమ్మద్ రఫీ అధ్యక్షతన సిపిఐ వంద సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి జాఫర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పి. నారాయణస్వామి, హాజరయ్యారు. ముందుగా రైతు సంఘం సీనియర్ నాయకులు శ్రీరాములు చేతులమీదుగా సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీ జాఫర్, నారాయణస్వామి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 ఆవిర్భవించి దేశ స్వతంత్రం కోసం ఎన్నో ఉద్యమాలు ప్రాణ త్యాగాలు చేసి స్వాతంత్రం కోసం దేశంలో ఉన్న కార్మికులు కర్షకులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని తెలిపారు. నాటి నుండి నేటి వరకు పేద మధ్యతరగతి ప్రజల పక్షాన ఉంటూ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అనేక పోరాట రూపకల్పన చేసింది సిపిఐ అని అన్నారు. ఈనాటికీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా త్యాగాల విజయ స్ఫూర్తి సభలను ఘనంగా నిర్వహించారు. కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతుల, ప్రజా వ్యతిరేక విధానాలను దుయ్యపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సి జాఫర్ పి నారాయణ స్వామికి యాడికి సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం సిపిఐ పార్టీ కోసం అమరులైన కుటుంబ సభ్యులను, సుదీర్ఘకాలం పార్టీకి సేవ లందించిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, సుబ్బయ్య సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, వికె ప్రదీప్ రెడ్డి, వెంగమ నాయుడు కుమారుడు అజయ్ బాబు, శ్యామ్ సుందర్, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఓబిరెడ్డి,సామాజికవేత్త , స్టాంప్ రైటర్ జూటూరు అబ్దుల్ రజాక్, సిపిఐ సీనియర్ నాయకులు జూటూరు బషీర్, పెద్దవడుగూరు మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్, సిపిఐ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, గుత్తి మండల కార్యదర్శి రామదాసు,సీమల వాగుపల్లి సూర్యనారాయణ, ఏఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి,ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నరసింహ,సిపిఐ మండల సహాయ కార్యదర్శి వడ్డరాముడు, చేనేత మండల కార్యదర్శి బండారు రాఘవ, సిపిఐ సీనియర్ నాయకులు గరిడి శివన్న,రసూల్, సిపిఐ పట్టణ కార్యదర్శి కుల్లాయి రెడ్డి, సిపిఐ మాజీ ఎంపీటీసీలు, పోస బాల చౌడయ్య, గుండా వెంకటమ్మ, సిపిఐ మాజీ వార్డు సభ్యులు పామిశెట్టి జయరాముడు, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సిపిఐ నాయకుడు జాఫర్



సిపిఐ జెండా ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

# ఆదోని జిల్లా సాధన దీక్షలకు కళాకారుల మద్దతు

## నేడు దీక్షల్లో పాల్గొననున్న కళాకారులు..

**ఆదోని, డిసెంబర్ 25:** ఆదోని జిల్లా ఏర్పాటు సాధనలో జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు మద్దతుగా ఆదోని లలిత కళా సేవా సంస్థ, ఆదోని లక్ష్మమ్మ నాట్యమండలి ఆధ్వర్యంలో రంగస్థలం కళాకారులు శుక్రవారం రిలే నిరాహార దీక్షలో పాల్గొంటున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఆదోని డివిజన్ రంగస్థల కళాకారులు హార్మోనిస్టులు ,సంగీత విద్వాంసులు, తబలిస్టులు, వివిధ లలిత కళల్లో నైపుణ్యం పొందిన వారు హాజరై తమ వంతు బాధ్యతగా రిలే నిరాహార దీక్షలో పాల్గొనాలని ఆదోని జిల్లా జేఏసీ కమిటీ, లలిత కళా సేవా సంస్థ , ఆదోని లక్ష్మమ్మ నాట్యమండలి కోరింది.

# సంక్రాంతి సెలవులు

**అమరావతి, డిసెంబర్ 25:** రాష్ట్రంలో విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ఖరారయ్యాయి. జనవరి 10 నుండి జనవరి 18 వరకు 9 రోజులు పాటు ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలకు సంక్రాంతి పండుగ సెలవును అధికారులు ప్రకటించారు .



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మాజీ సర్పంచ్ రాజారెడ్డి

## క్రిస్మస్ వేడుకలకు హాజరైన మాజీ సర్పంచ్ రాజారెడ్డి

**అట్లూరు, డిసెంబర్ 25:**
మండలంలోని కుంభగిరి గ్రామపంచాయతీ ఎస్ వెంకటాపురం ఉప్పుటూరు కాలనీలోని చర్చిలో క్రిస్మస్ పర్వదిన వేడుకలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పుటూరు ఏసన్న, మల్లీనేని పట్నం ఈశ్వరయ్య ల ఆహ్వానం మేరకు కుంభగిరి మాజీ సర్పంచ్ రాజారెడ్డి,కొత్తూరు పెంచలయ్య లను హాజరయ్యారు. నాయకులు మరియు కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు, చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాజారెడ్డి పాల్గొనటం జరిగినది. అనంతరం కేక్ కట్ చేసి, స్థానిక క్రైస్తవ సోదరులకు, ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలైన ప్రేమ, శాంతి, దయ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, దేవుని అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య, లుకయ్య , రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ కమిటీ

**విజయవాడ, డిసెంబర్ 25:**
విజయవాడ టిడిపి పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలుగా షేక్ నసీమా, ప్రధాన కార్యదర్శిగా పితాని పద్మన మరో 16 మందితో కమిటీని ప్రకటించారు.



చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న టిడిపి నేతలు

## రామకుప్పంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**రామకుప్పం, డిసెంబర్ 25:**
స్థానిక చర్చల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గురువారం బల్ల, వీర్నమల, గెరిగిపల్లి, రామ కుప్పంలోని హెూలీ చర్చ్ లో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి బైబిల్ లోని ముఖ్య అంశాలను బోధించారు. అనంతరం కేక్ కత్తిరించి ఒకరికొకరు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సర్పంచ్ సీతాపతి, కడ సభ్యుడు రఘు ,మురళి, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఎల్ఇడి బల్బులు పంపిణీ చేస్తున్న నేతలు

## గ్రామ వీధుల్లో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు

**రామకుప్పం, డిసెంబర్ 25:**
సీఎం చంద్రబాబు నేతృత్వంలో కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేయనున్నట్లు రామ్మూర్తి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ డైరెక్టర్ జయశంకర్ పేర్కొన్నారు. గురువారం ఉన్సిగానిపల్లిలో పంపిణీ చేశారు. కుప్పం ప్రత్యేక కడ నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లిస్టర్ కో ఇన్చార్జ్ శంకరాచలం రైతుల పాల్గొన్నారు.

## వాజ్‌పేయి జయంతి వేడుకలు

**రామకుప్పం, డిసెంబర్ 25:**
భారతదేశం మాజీ ప్రధాని దేవంగత అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను బిజెపి నేతలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక బందార్లపల్లి క్రాస్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ భారతదేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశల కృష చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ అధ్యక్షురాలు రాణి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆంజనేయప్ప, కూటమి నేతలు జయరాం రెడ్డి లోకనాథ్ రెడ్డి కమల్నాథ్ రెడ్డి నాగరాజు కార్తీక్ సతీష్ అవినాష్ రెడ్డి బాలాజీ నాగలక్ష్మి తులసి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

# ఘనంగా మాజీ మంత్రి వీరారెడ్డి వర్ధంతి

### నివాళులర్పించిన అగ్రనేతలు, అభిమానులు..

**బద్వేలు డిసెంబర్ 25:**
బద్వేలు నియోజకవర్గ ప్రజల హృదయాల్లో పెద్దాయనగా నిలచి కడప జిల్లా రాజకీయాలను ఒంటి చేత్తో శాశించిన అపర చాణక్యుడు రాజకీయ దురంధరుడిగా ఖ్యాతి పొంది, తను మరణించి నేటికీ 25 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ కూడా బద్వేలు ప్రాంత ప్రజల మదిలో స్థిరంగా స్థిర స్థానం ఏర్పరచుకున్న దివంగత నేత సీనియర్ మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి వర్ధంతిని ప్రజలు నియోజక వర్గ వ్యాప్తంగా ఆశేషంగా తరలి వచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజలు. రైతులు కార్మికులు కర్షకులు సీనియర్ రాజకీయ నేతలు అభిమానులు రాజకీయ నేతల నడుమ పట్టణంలో ఘనంగా వర్ధంతిని నిర్వహించారు.దివంగత మంత్రి బిజివేముల వీరారెడ్డి 25 వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని బి.వి.ఆర్. కాలేజీ ఆవరణలోని "ఘాట్" లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తో పాటు, వీరారెడ్డి కుమార్తె మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, అల్లుడు డాక్టర్ రవికుమార్ రెడ్డి దంపతులు, మనవడు తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రితేష్ రెడ్డి, లీలా కైవల్య రెడ్డి లు బి.వి.ఆర్ ఘాట్ లో ఘన నివాళులు అర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలతో కలసి
బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో వున్న బిజివేముల వీరారెడ్డి కాంస్య విగ్రహానికి క్రేన్ సహాయంతో ఏర్పాటుచేసిన భారీ గజమాలను అలంకరించారు.ఈ సందర్భగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి వీరారెడ్డి రైతు బాంధవుడు అని, ఉన్నత విద్య కోసం కళాశాలలను ఏర్పాటు చేసిన విద్యా ప్రదాత అని ఈ ప్రాంతా రైతాంగానికి సాగు నీరు అందించాలని అహర్నిశలు కృషిచేసిన గొప్ప యోధుడని ఆయన కొనియాడారు. చివరి



మాజీ మంత్రి వీరారెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్వాసవరకు నిరాండంబరంగా ప్రజల కోసమే జీవించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ సందర్భంగా అభిమానులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బి.వి.ఆర్ విద్యాసంస్థల్లో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. జబర్దస్త్ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు కళాత్మకంగా నిర్వహించారు. బి.వి.ఆర్ ఘాట్ కు కడప పార్లమెంటు అధ్యక్షులు భూపేశ్ సుబ్బరామిరెడ్డి, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ,బద్వేలు కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న,టిడిపి నాయకులు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, ముక్తియార్,రాష్ట్ర డైరెక్టర్లు వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి, సాధనకారి రంతు, బద్వేలు
మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి రవీంద్రారెడ్డి, గోపవరం జడ్పిటిసి జయరామిరెడ్డి,స్థానిక కూటమి నాయకులు వెంగళరెడ్డి, మల్లికార్జున రెడ్డి,బసిరెడ్డి రవికుమార్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి,షేక్ మహబూబ్ బాషా, జహంగీర్ బాషా, బొమ్మన విజయ్, నాగభూషణం, జ్యోతి కృష్ణారెడ్డి , కొండ్రెడ్డి బ్రదర్స్ జయసుబ్బారెడ్డి, రామిరెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



మాజీ మంత్రి వీరారెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

# ప్రొద్దుటూరులో ఘనంగా వాజపేయి జయంతి వేడుకలు

### బిజెపి పట్టణ అధ్యక్షులు పాలెంరెడ్డి కిరణ్ ..

**ప్రొద్దుటూరు, డిసెంబర్ 25**
ప్రొద్దుటూరు పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు పాలెం రెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో గురువారం మాజీ ప్రధాని బిజెపి నాయకుడు అటల్ బిహారీ వాజపేయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలెం రెడ్డి కిరణ్ మాట్లాడుతూ , అటల్ జీ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు , ఆయన ఒక గొప్ప కవి , వక్త, అలుపెరుగని దేశభక్తుడని పేర్కొన్నారు .ఆయన పుట్టినరోజుని మనం సుపరిపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.పారదర్శకమైన పాలన అందించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు రురల్ అధ్యక్షుడు మురళీరెడ్డి మాట్లాడుతూ ఆయన పొరుగు దేశాలతో శాంతిని కోరుకుంటూనే , కార్గిల్ యుద్ధంలో శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించిన వీరుడు అని పేర్కొన్నారు . స్టేట్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గురు మాట్లాడుతూ అటల్ జీ చూపిన మార్గంలో నడుస్తూ అంత్యోద్యయా లక్ష్యంతో ముందుకు సాగుదాం,ఆయన ఆశయ సాధన కోసం ప్రతి



వాజపేయికి నివాళులు అర్పిస్తున్న బిజెపి నాయకులు

కార్యకర్త పునరంకితం కావాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దటూరు అర్బన్–%××% ప్రెసిడెంట్ పాలెం రెడ్డి కిరణ్ , స్టేట్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గురు , జిల్లా కార్యదర్శి జయలక్ష్మి , ప్రొద్దటూరు రూరల్ అధ్యక్షుడు గోపిరెడ్డి మురళీరెడ్డి , రవి శంకర్ , సాయిబాబా ,సుధాకర్ రెడ్డి , పాలెం గురు రాజేష్ , మారుతీ , తదితరులు పాల్గొన్నారు.

# దువ్వూరులో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

### రోడ్లపైనే వ్యాపారాలు.. పట్టించుకోని అధికారులు..

**దువ్వూరు, డిసెంబర్ 25 :**
దువ్వూరు మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. రోడ్డుపై ఉన్న షాపుల యజమానులు తమ హద్దులు దాటి నడిరోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తుండటంతో రోడ్లపై తిరుగుతున్న వారు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ?రోడ్డు ఆక్రమణలు, దుకాణదారులు తమ షాపుల ముందు రోడ్డును ఆక్రమించడమే కాకుండా, రోడ్డుపై కాళీ స్థలాలను మరికొందరికి అద్దెకు ఇస్తూ రోడ్డుపైనే వ్యాపారాలు చేయిస్తున్నారు. దీనివల్ల రహదారి కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.



రోడ్లపైన వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం



ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్న వాహనాలు

పార్కింగ్ సౌకర్యం లేకపోవడం, చుట్టుపక్కల పల్లెల నుండి వచ్చే ప్రజలు తమ వాహనాలను నిలపడానికి నిర్దిష్ట స్థలం లేక రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు. ఇది ట్రాఫిక్ జామ్‌కు ప్రధాన కారణమవుతోంది. స్కూల్ బస్సుల ఇబ్బందులు, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రొద్దుటూరుకు వెళ్లే 10 నుండి 15 స్కూల్ బస్సు లు ఇలా రోడ్ల ఆక్రమణల వల్ల రోడ్డు మధ్యలోనే విద్యార్థులను ఎక్కించుకోవాల్సి వస్తోంది. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇలా వాహనదారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి.నూతనంగా బస్ షెల్టర్ ఏర్పాటు చేసిన
?ఒకవైపు ఆటోలు, మరోవైపు వ్యాపారాలతో నిండిపోవడంతో బస్సులు నిలపడానికి చోటు లేదని ఆర్టీసీ డ్రైవర్లు కూడా వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి, రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని దువ్వూరు మండల ప్రజలు కోరుతున్నారు.

# మంచూరు నివాసానికి టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి

**బద్వేల్ డిసెంబర్ 25:**



కడప జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడి హెూదాలో తొలిసారి బద్వేల్ లోని కడప డిసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి. నివాసానికి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి. వచ్చారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డికి ఘనంగా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి గౌరవ ప్రదంగా తన నివాసానికి ఆహ్వానించి శాలువా గజమాలతో సన్మానించారు. అనంతరం సూర్యనారాయణ రెడ్డి ఇచ్చిన తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీని పేదలకు బడుగు బలహీన వర్గాలకు అత్యంత దగ్గర చేయాలని వారి అభ్యున్నతికి పార్టీ దోహదపడేలా కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామని ఈ సందర్భంగా చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి. నెల్లూరు డిసిసి బ్యాంక్ చైర్మన్ ధనుంజయ రెడ్డి. బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు గోడిరమణారెడ్డి, రామచంద్రారెడ్డి,అట్లూరు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి బోవిల్ల. అబ్బిరెడ్డి నరసింహారెడ్డికార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.





నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

## గుండెపోటుతో యువకుడి మృతి

### మండల నాయకుల సంతాపం..

**అట్లూరు డిసెంబర్ 25:**
గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన అట్లూరు మండలం కొండూరులో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన దేవి రెడ్డి రాజారెడ్డి కుమారుడు దేవి రెడ్డి శివ గోపాల్ రెడ్డి (32) బుధవారం రాత్రి కడప రిమ్ కు తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా వైద్యశాలలో చికిత్స నిమిత్తం ఉండగా అకస్మాత్తుగా గురువారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. వెంటనే అతని కుటుంబ సభ్యులు కొండూరు గ్రామానికి తరలించి దహన క్రియలు పూర్తి చేశారు. డ్రైవర్ పనిచేసి జీవనం సాగించేవాడు. ఒక గాన ఒక కొడుకు చనిపోవడంతో కుటుంబం రోడ్డున పడ్డారు. అతనికి తల్లి, తండ్రి ఉండడంతో వారిని ఏడుపు చూచి కుటుంబ సభ్యులు, బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అమలుకున్నాయి. కుటుంబ పెద్ద చనిపోవడంతో తెలుగుదేశం పార్టీ తరపున కానీ ప్రభుత్వం తరఫున కానీ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు బంధువులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సర్పంచ్ సుధా, పాపుదిప్పు.మల్లికార్జున రెడ్డి, బోవిల్ల.అమర్నాథ్ రెడ్డి, పాలకొండు. రాజగోపాల్ రెడ్డి, కుడమలచిన్నపరెడ్డి, పాలకొల్లు. రామచంద్రారెడ్డి, బోవిల్ల.తిరుపాల్ రెడ్డి, దున్నుతల .రాజగోపాల్ రెడ్డి, దున్నుతల.బాలకృష్ణారెడ్డి, పల్లెం. వెంకట నర్సారెడ్డి, డి సి, బో విల్ల. రామకృష్ణారెడ్డి ,బోవిల్ల.వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## వీఆర్ఏ సమస్యలు పరిష్కరించాలి

### రెవెన్యూశాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సాయి ప్రసాద్‌కు వీఆర్ఏ జేఏసీ వినతి..

**బద్వేల్, డిసెంబర్ 25:**
ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన జరిగిన "మహాధర్నా" కారణంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్. ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్. సిసిఎల్ఏ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి మరియు రెవెన్యూశాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో 24. 12 .2025. వ తేదీన విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నందు మధ్యాహ్నం 3:30 నుండి 7 గంటలు వరకు సుమారు మూడున్నర గంటలు పాటు ఏకధాటిగా అధికారులతో రెవెన్యూ శాఖ మాత్యులు రివ్యూ మీటింగ్ జరిపారు. ఈ సమావేశంలో వీఆర్ఏల సమస్యలతో పాటు వీఆర్వో. సర్వేయర్స్. యొక్క సమస్యలపై కూడా ఉన్నతాధికారుల భేటీలో చర్చ జరిగింది. అనంతరం వీఆర్ఏ జేఏసీ నేతలతో రెవిన్యూ శాఖ మాత్యులు మాట్లాడుతూ అన్ని విషయాల పైన కులం కుశంగా ఉన్నతాధికారుల సమావేశంలో చర్చించామని ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు అన్ని వివరాలు వెల్లడిస్తామని వీఆర్ఏలు అందరూ ధైర్యంగా ఉండాలని ఆయన నేతలకు మనోధైర్యం కల్పించారు. సంక్రాంతి కానుకగా ప్రభుత్వం విఆర్ఏ లకు వరాలు ప్రకటించాల్సిందేనని ఆయన ముందు జెఏసి నేతలు వాపోయారు, ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ నల్లిపోగు నాగేశం. ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెల్లూరు సురేష్ . రాష్ట్ర కార్యదర్శి అంకయ్య. షేక్ రసూల్. గుంటూరు రవితేజ. తదితరులు పాల్గొన్నారు,



రెవెన్యూశాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సాయి ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏ జేఏసీ నాయకులు

## మాజీ మంత్రి వీరారెడ్డికి ఘన నివాళులు

### డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి..

**బద్వేల్, డిసెంబర్ 25 :**
మాజీమంత్రి దివంగత నిజమే మల వీరారెడ్డి 25 వ వర్ధంతి సందర్భంగా గురువారం ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి వీరారెడ్డి ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన పేద ప్రజలకు తన వంతు బాధ్యతగా సేవలు చేయాలని దృఢ సంకల్పంతో రాజకీయంలోకి ప్రవేశించి మొదటిగా 1955వ సంవత్సరంలో చెన్నంపల్లి సర్పంచ్ గా గెలిచి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. అనంతరం 1982వ సంవత్సరములో మొట్టమొదటిసారిగా స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలుపొందారని, 1984వ సంవత్సరంలో నందమూరి తారక రామారావు క్యాబినెట్లో వ్యవ సాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి జిల్లాకే మాజీమంత్రి వీరారెడ్డి పెద్దాయనగా గుర్తింపు తెచ్చుకున్నారు. అంతేకాకుండా చంద్రబాబు నాయుడు క్యాబినెట్లో 1999వ సం వత్సరంలో మార్కెటింగ్ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తన భుజాలపై వేసుకొని కడప జిల్లాలో టిడిపి పార్టీ కార్యకర్తలను ఒకే తాటిపై నడి పించి టిడిపి పార్టీకి అత్యధిక సీట్లు వచ్చేలా కృషి చేసేవారన్నారు. అందుకే జిల్లా వాసులు మాజీ మంత్రి వీరారెడ్డిని రాజకీయ భీష్ముడని పెద్దలు వ్యాఖ్యానించేవారు. అని తెలిపారు. అంతే కాకుండా పేద విద్యార్థులు చదువుకునేందుకు దూర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసించాలంటె ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకున్న ఆయన జిల్లాలో ఎక్కడా లేని విధంగా బద్వేల్ పట్ట ణంలో జూనియర్ కళాశాల నుంచి అగ్రికల్చర్ కళాశాల వరకు ఒకే ప్రాంగణంలో సుమారు 3000 మంది విద్యార్థి, విద్యార్థులు చదువుకునేలా ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించే విధంగా కళాశాలలను ఏర్పాటు చేశార న్నారు. ఆయన మార్కెటింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు 25సంవత్సరాల కిందట పవిత్ర దినమైనటువంటి క్రిస్మస్ రోజున అకస్మా తుగా పెద్దాయన మరణించడంతో కడప జిల్లాకే ఒక పెద్ద దిక్కును కోల్పోయామని టిడిపి కార్య కర్తలు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోజు నుండి ఇప్పటివరకు క్రిస్మస్ పండుగ వచ్చిం దంటే పెద్దాయన వర్ధంతిని టిడిపి కార్యకర్తలు అభిమానులు ఘనంగా నివాళులర్పించి రెండు పండు గల ను నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు. ఆయన మరణించినప్పటి నుంచి ఆయన చూపి న మార్గదర్శకాలతోనే నేటి యువత రాజకీయ అరంగ్రేటం చేస్తున్నారనీ. ఆయన మరణించిన ప్పటికీ పెద్దాయనఆత్మ అంతా టిడిపి కార్యకర్తల వెనువెంట ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం మైదుకూరు రోడ్ లోని వీరారెడ్డి ఘాట్ వద్దకు చేరుకొని ఆయనకు ఘనంగా పూలతో నివాళులర్పించారు. మంచురు. సూర్యనారాయణ రెడ్డి వెంట అట్లూరు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులురెడ్డి, బోవిల్ల అబ్బిరెడ్డి గారి నరసింహారెడ్డి , రామచంద్రారెడ్డి రమణారెడ్డి, ఉప్పతి. రామకృష్ణారెడ్డి,పెద్దాయన అభిమానులు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి వీరారెడ్డికి నివాళులు అర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి



ఎంవి శేషయ్యకు సన్మానం చేసి కేకు తినిపిస్తున్న దృశ్యం

## టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంవి శేషయ్య

**నెల్లూరు(బుచ్చిరెడ్డిపాలెం), డిసెంబర్ 25:**
బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలోని టిడిపి సీనియర్ నాయకులు ఎం. వి . శేషయ్య తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా కేక్ ని కట్ చేయించి,శుభాకాంక్షలు తెలియజేసిన, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి దంపతులు. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ మాట్లాడుతూ టిడిపి సీనియర్ నాయకులు ఎం.వి.శేషయ్య కి తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా పదవి ఇవ్వడం జరిగిందని,అందుకు మన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు,టిడిపి నాయకులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న నీటి సంఘం అధ్యక్షులు వేమూరి దొరస్వామి నాయుడు

## సిపిఎం కార్యాలయానికి విరాళం

### నీటి సంఘం అధ్యక్షులు వేమూరి దొరస్వామి నాయుడు..

**ఉదయగిరి(వింజమూరు) డిసెంబర్ 25:**
వింజమూరు మండలంలో సి.పి.యం నూతన కార్యాలయం నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో నియోజవర్గానికి చెందిన సిపిఎం నాయకులు విరాళాలు సేకరిస్తున్న నేపథ్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రపడియ గ్రామ నీటి సంఘం అధ్యక్షుడు వేమూరి దొరస్వామి నాయుడు దృష్టికి తీసుకొని వెళ్ళారు. వెంటనే నీటి సంఘం అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు వేమూరి దొరస్వామి నాయుడు స్పందిస్తూ పదివేల రూపాయలు విరాళం నియోజకవర్గ సి.పి.యం పార్టీ సీనియర్ నాయకుడు బయన్న చేతికి అందజేసారు. ఈ కార్యక్రమంలో సి. ఐ. టి. యూ వింజమూరు మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి,మర్రి శీనయ్య,గంగపట్ల తిరుమలయ్య,బిల్లుపాటి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస వేడుకలు

### కాకర్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ ..

**ఉదయగిరి(వింజమూరు) డిసెంబర్ 25:**
ఉదయగిరి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో ఉన్ని క్రైస్తవ చర్చలకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆనవాయితీగా ఈ ఏడాది కూడా స్వీట్లు పంపిణీ చేశారు.ా ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ సారధ్యంలో నిర్వహిస్తున్న కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వింజమూరు మండలం లోని ఏ కీస్తీపురం, చింతలపాలెం, చంద్రపడియ గ్రామలలో ఏసు క్రీస్తు జన్మదినం పురస్కరించుకుని చర్చిల నందు చంద్రపడియ గ్రామ నీటి సంఘం అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు వేమూరి దొరస్వామి నాయుడు చేతుల మీదుగా చర్చి పాస్టర్లకు స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చర్చిల పాస్టర్లు, క్రైస్తవ సోదర, సోదరిమణులు, తెలుగుదేశం పార్టీ నాయకులు బిల్ పాటి వెంకయ్య,దారపనేని శ్రీనివాసులు, మన్నెం బాలకృష్ణ, మన్నెం సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కానుకలు అందిస్తున్న దృశ్యం

...

## రక్షకుడు పుట్టిన వేళ..

### ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**నెల్లూరు (బుచ్చిరెడ్డిపాలెం), డిసెంబర్ 25:**
బుచ్చి మున్సిపాలిటీ పరిధిలోని వవ్వేరు బేతెస్థ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో కిస్మస్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి.. ఆ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక సందేశంతో మార్మోగింది.. ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చర్చి పరిసర ప్రాంతమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది..క్రిస్మస్ వేడుకల ప్రారంభ సూచకంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు..అర్ధరాత్రి నుంచే ఆలయంలో ప్రార్థనలు, భక్తి గీతాలను ఆలపిస్తూ సందడి చేసారు..శాంతి, ప్రేమ, సోదరభావం' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ కార్యక్రమం సాగింది..పాస్టర్ భాస్కర్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు..సందేశం ముగిసిన అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

## జగన్‌కు క్రిస్మస్ శుభాకాంక్షలు

**అనంతపురం, డిసెంబర్ 25**
బెంగళూరులోని జక్కూరు హెలిపాడ్ వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్ భారతి రెడ్డిని మాజీ మంత్రివర్యులు, శ్రీ సత్య సాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, శ్రీమతి ఉషశ్రీ చరణ, కదిరి సమన్వయకర్త మక్బూల్ వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆడబిడ్డల భవిష్యత్తుకు అండగా ఉంటాం

## రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఆడబిడ్డలకు పరామర్శ.. మంత్రి ఆనం..

**ఆత్మకూరు, డిసెంబర్ 25 :**
ఇటీవల ఆత్మకూరులో నెల్లూరు పాలెం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం దుర్ఘటనలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు ఆడబిడ్డలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరామర్శించారు. గురువారం ఆత్మకూరు రూరల్ మండలం బోయిల్లచిరువెళ్ళ గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు చావల మాధవ , ఆయన సతీమణి మనోజ చిత్రపటానికి మంత్రి ఆనం నివాళులర్పించారు. వారి కుమార్తెలు మనస్విని, లక్ష్మీ తేజస్వినిని దగ్గరకు తీసుకుని ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. వారిని ఓదార్చి.. తల్లిదండ్రులు లేని లోటు ఎవరు తీర్చలేనిదని, ఈ దుర్ఘటన అందరినీ కలచివేసిందని మంత్రి తన బాధను వ్యక్తం చేశారు. ఆడబిడ్డల భవిష్యత్తుకు తాను అండగా ఉంటానని, ఈ ప్రాంత ప్రతినిధిగా వారి బాధ్యతను తీసుకుంటున్నట్లు మంత్రి ప్రకటించారు.
మనస్విని (ఇంటర్ ద్వితీయ సంవత్సరం) లక్ష్మీ తేజస్విని (9వ



మనస్విని, లక్ష్మీ తేజస్విని పరామర్శిస్తున్న మంత్రి ఆనం



టిడిపి కుటుంబ సభ్యులు మాధవ మనోజ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అనం

తరగతి)విద్యాభ్యాసానికి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. వారికి ఉన్న మూడు ఎకరాల భూములను కూడా రెవిన్యూ సమస్యలను తొలగించి ఇద్దరికీ చెరిసగం భూములకు పట్టాలు తయారు చేయించి ఇవ్వాలని తాసిల్దార్ ను ఆదేశించినట్లు చెప్పారు. ప్రభుత్వం ద్వారా నూతన ఇంటిని మంజూరు చేయించి అధికారుల ద్వారానే ఆ ఇంటిని పూర్తి చేయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. చనిపోయిన వారిద్దరూ తమ పార్టీ క్రియాశీలక సభ్యులైనందున పార్టీ తరపున ఇన్సూరెన్స్ మొత్తాన్ని కూడా నారా లోకేష్ బాబు తో మాట్లాడి ఇప్పిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లి కూడా ఇద్దరు ఆడపిల్లలకు మరింత ఆర్థిక సహాయం చేస్తామని మంత్రి ప్రకటించారు. తల్లిదండ్రులు కోల్పోయిన బిడ్డలను ఆ ఇంటి పెద్దదిక్కులా స్వయంగా మంత్రి వచ్చి పరామర్శించి, ఆ ఆడబిడ్డల భవిష్యత్తుకు ధైర్యం చెప్పిన తీరు ప్రతి ఒక్కరిని కదిలించింది. ప్రమాదం జరిగిన రోజు ఆత్మకూరులోనే ఉన్న మంత్రి నేరుగా ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి వెళ్లి సంఘటనను తెలుసుకొని పరామర్శించారు. అంతటితో మరచిపోకుండా మానవతావాదిగా..నేడు స్వయంగా వారి ఇంటికి వచ్చి ఆ బిడ్డలకు తాను,తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆ బిడ్డలకు ఏం కష్టం వచ్చినా తాను ఉంటాననే నమ్మకాన్ని భరోసాను కల్పించారు.

# అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు

## కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే కాకర్ల క్రిస్మస్ కానుక..

(ఉదయగిరి/వింజమూరు) డిసెంబర్ 25 :
ఉదయగిరి నియోజకవర్గంలో ఏసుప్రభు పుట్టినరోజు సంబరాలు అంబరాన్ని అంటాయి. క్రిస్టియన్ సోదరులందరూ ఏకువజామనే ప్రార్థనా మందిరాలకు చేరుకొని కరుణామయుడు లోక రక్షకుడు ఏసుప్రభు కి ప్రార్థనలు చేశారు. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలోని అన్ని ప్రార్థనా మందిరాలకు స్వీట్లను పంపిణీ చేశారు. ఎనిమిది మండలాల నాయకులు ఏ మండలానికి సంబంధించిన ఆ మండలం లోని చర్చల వద్దకు వెళ్లి పాస్టర్లకు స్వీట్లను పంపిణీ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ క్రిస్టియన్ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.శాంతి,దయ, ప్రేమ ,ధర్మం, న్యాయం, అహింస , పరోపకారం, వంటి ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవళికి ఆచరణీయమని క్రీస్తు చూపిన సన్మార్గంలోనే ప్రతి ఒక్కరూ పయనించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. క్రిస్టియన్ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక



చర్చిల్లో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కానుకలు అందిస్తున్న దృశ్యం

ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్రాన్ని సుపరిపాలన వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పై రాష్ట్ర ప్రభుత్వం పై ఆ ఏసుప్రభు కరుణాకటాక్షాలు మెండుగా ఉండాలని ప్రార్థించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలియజేశారు.





చర్చిల్లో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కానుకలు అందిస్తున్న దృశ్యం

# అధైర్య పడొద్దు , అండగా ఉంటాం..

## వైసీపీ కార్యకర్త ప్రభుదాస్ కుటుంబానికి వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి భరోసా..

**పెద్దకడబూరు, డిసెంబర్ 25 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కెంగారి ప్రభుదాస్ (44) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు కేపీ యల్లప్పతో కలిసి ప్రభుదాస్



ప్రభుదాస్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైసీపీ నేత ప్రదీప్ రెడ్డి



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి

మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరుపున మట్టి ఖర్చుల కోసం రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బాపురం హనుమంతరెడ్డి, బ్రహ్మయ్య ఆచారి, సోమప్ప గౌడ్, లింగన్న గౌడ్, నరసింహ ఆచారి, యోహాను, బొడ్డన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## రాయచోటిలో మానవీయ పోలీసింగ్

### తప్పిపోయిన చిన్నారి అప్పగింత..

**రాయచోటి, డిసెంబర్ 25**
రాయచోటి పట్టణంలో తప్పిపోయిన 4 ఏళ్ల చిన్నారి శ్రీహాన్‌ను పోలీసులు అత్యంత వేగంగా స్పందించి కేవలం 10 నిమిషాల్లో క్షేమంగా గుర్తించారు. గురువారం ఉదయం మహబూబ్ బాషా వీధిలో ఇంటి ముందు ఆడుకుంటున్న శ్రీహాన్ అకస్మాత్తుగా కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వీధులన్నీ గాలించినా ఫలితం లేకపోవడంతో అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదు అందగానే సీఐ బీవీ చలపతి వెంటనే ఎస్ఐ జహీర్‌తో పాటు పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఒకవైపు సీసీ కెమెరాల పరిశీలన, మరోవైపు క్షేత్రస్థాయి సమాచారంతో పోలీసులు వేగంగా కదిలారు. ఇదే సమయంలో ఏడుస్తూ రోడ్డుపై వెళ్తున్న బాలుడిని గమనించిన స్థానికులు మసీదుకు చేర్చారు. మసీదు మైక్



ద్వారా సమాచారం అందగానే పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని గుర్తించారు. పోలీసులు బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించగా భావోద్వేగ దృశ్యాలు చోటు చేసుకున్నాయి. ఈ వేగవంతమైన, మానవీయ చర్యలపై జిల్లా ఎస్పీ ధీరజ్ పోలీసు బృందాన్ని అభినందించారు.



## వైకుంఠ ఏకాదశి, ఇస్తిమా ఏర్పాట్ల పరిశీలన

### జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమాం

**కదిరి, డిసెంబర్ 25:**
కదిరి పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 29, 30 తేదీలలో జరగనున్న ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ శివన్నారాయణ స్వామితో కలిసి గురువారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించిన ఎస్పీ గారు, ఉత్తర ముఖ ద్వారం గుండా భక్తులకు దర్శన సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాతో పాటు కర్ణాటక , వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ అధికారులు, పోలీసు అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు ఆలయ పరిసరాల్లో వాహనాల పార్కింగ్, క్యూలైన్ల ఏర్పాట్లు, కదిరి–హిందూపురం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఉత్తర ముఖ ద్వారం వద్ద అవసరమైన దారి మళ్లింపులు, తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు.

**ఇస్తిమా ఏర్పాట్ల పరిశీలన..**
అదేవిధంగా, ఈనెల 27, 28 తేదీల్లో కదిరి బైపాస్ వద్ద జరగనున్న ఇస్తిమా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కూడా జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఇస్తిమా నిర్వాహకులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమానికి వచ్చే వారి సంఖ్యను దృష్టిలో ఉంచుకుని వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు సమగ్ర ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా భద్రతాపరమైన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కదిరి ఆర్డిఓ శర్మ . డీఎస్పీ శివన్నారాయణ స్వామి, ఆల్ ఐ ఈ ఓ శ్రీనివాసరెడ్డి ,సీఐలు నారాయణరెడ్డి, నాగేంద్ర, నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు, ఆలయ సిబ్బంది, ఇస్తిమా నిర్వాహకులు పాల్గొన్నారు.



## జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

**మదనపల్లె, డిసెంబర్ 25:**
మదనపల్లె మండలంలో గురువారం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగు చూసింది. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు.. కోళ్లబైలు గ్రామం జగన్ కాలనీలో నివాసం ఉంటున్న రామస్వామి కుమారుడు హరినాథ్ (30) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం అప్పులు చేశాడు. చికిత్స చేసినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో పాటు భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ నేపథ్యంలో ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లక్కిరెడ్డిపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా డి. శోభ బాధ్యతల స్వీకరణ

**లక్కిరెడ్డిపల్లి, డిసెంబర్ 25:**
లక్కిరెడ్డిపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా డి. శోభ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ, చట్టవ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజలతో సమన్వయం పెంచి పోలీసు సేవలను సమర్థవంతంగా అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ పోలీసు సిబ్బంది ఎస్సై శోభకు శు భాకాంక్షలు తెలిపారు.

## తమిళనాడులో ఘోర రోడ్డుప్రమాదం

**తిరుచ్చి, డిసెంబర్ 25:**
టైరు పేలి అదుపు తప్పిన బస్సు రెండు వాహనాలను ఢీకొనడంతో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 8 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం, బస్సు తిరుచ్చి నుంచి చెన్నై వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. టైరు అకస్మాత్తుగా పేలడంతో బస్సు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అంబులెన్సులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడినవారు ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.





హిందూ సమ్మేళనం కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు. మాట్లాడుతున్న గురు సేవానంద స్వాములు, ఆర్ఎస్ఎస్ అనంతపురం విభాగ ప్రచారక్ లక్ష్మణ్ జీ

# హిందూ సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత మనదే

**నేడు స్వధర్మాన్ని విడిచి పర ధర్మాన్ని ఆచరిస్తున్నారు... ప్రపంచంలో సమర్థవంతమైన దేశంగా భారత్... ముఖ్య అతిథులు గురుసేవానంద స్వామి.. ఆర్ఎస్ఎస్ అనంతపురం విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్ జీ.. బెళుగుప్పలో వైభవంగా హిందూ సమ్మేళనం..**

**బెళుగుప్ప, డిసెంబర్ 25:**
హిందూ సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత హిందువులుగా మనదేనని, నేటి సమాజంలో కొంతమంది స్వధర్మాన్ని విడిచి పర ధర్మాన్ని ఆచరిస్తున్నారని, ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని కమలపాడు శ్రీ గురుసేవానంద స్వాములు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన బెళుగుప్ప లో ఉప మండల కేంద్రంగా స్థానిక శ్రీ శ్రీనివాస విద్యా నికేతన్ మైదానంలో బెళుగుప్ప హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో వైభవంగా హిందూ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమలపాడు శ్రీ గురు సేవానంద స్వాములు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ( ఆర్ఎస్ఎస్ ) అనంతపురం విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్ జీ పాల్గొన్నారు. మొదట యువకులు జైశ్రీరామ్ నామస్మరణంతో బెళుగుప్ప లోని పురవీధుల గూండా మోటర్ బైకుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు శ్రీ గురు సేవానంద స్వాములు, ఆర్ఎస్ఎస్ అనంతపురం విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్ జీ లను హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు, గ్రామస్తులు చిన్నారుల కోలాటం, భజనలతో, మేళ తాళాల మధ్య శ్రీనివాస విద్యా నికేతన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద వరకు ఘన స్వాగతం పలికారు. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి, భరతమాత, శ్రీరాముడు, చత్రపతి శివాజీ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్య అతిథులు శ్రీ గురుసేవానంద స్వామి మాట్లాడుతూ నేటి సమాజంలో కొందరు పూర్వం నుంచి వస్తున్న హిందూ సాంప్రదాయాలు, కట్టుబాట్లను మర్చిపోతున్నారన్నారు.నేటి పిల్లలు తల్లిదండ్రులకు నమస్కారం చేయడం నామోషీగా అయిపోయిందన్నారు. భగవద్గీతను అధ్యయనం చేయాలని, భారత, భాగవతములను చదవాలని అందులో ఉన్న ధర్మాన్ని, పరమార్థాన్ని,నీతిని, పిల్లలకు తెలియ చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. దేశ సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మనిషి పిరికితనంతో బలహీనంగా బ్రతకడం కంటే మరణించడం మేలని స్వామి వివేకానంద బోధించారని గుర్తు చేశారు. ముఖ్యంగా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహించాలని బలహీనమైన మాటలతో పిల్లల్ని బలహీనులుగా తయారు చేయకుండా వారిలో జాగృతాన్ని మేల్కొలపాలన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ( ఆర్ఎస్ఎస్ ) అనంతపురం విభాగ ప్రచారక్ లక్ష్మణ్ జీ మాట్లాడుతూ 1925లో ఆంగ్లేయులు ఈ దేశాన్ని పరిపాలిస్తున్నప్పుడు



శ్రీనివాస విద్యానికేతన్ చిన్నారుల నృత్య ప్రదర్శన



గ్రామంలో కోలాటం, మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రారంభించబడి మొన్నటికి మొన్న విజయదశమికి నూరు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఈ దేశ ప్రజల్లో దేశభక్తిని నిర్మాణం చేయడం కోసం ఈ దేశంలో ఉండే హిందువులను నేను హిందువులనుగా అనుకొని కులాలకు, వర్గాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు గుజరాత్ నుండి అరుణాచల్ ప్రదేశ్ వరకు కూడా మన అందరి యొక్క తల్లి ఈ భరతమాత, మనలో ప్రవహించేది ఈ తల్లి యొక్క రక్తం, మనమందరం ఈ తల్లి వారసులం అనే భావన నిర్మాణం చేయడం కోసం ప్రారంభించబడిన సంస్థే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. ఈ సంస్థ ప్రారంభించింది ఈ దేశంలో ఉన్న హిందువులను చైతన్యవంతుల్ని చేయడం కోసం ఈ దేశ హిందువులని సంఘటితం చేయడం కోసం,ఈ దేశ హిందువులు తన హిందుత్వాన్ని మరిచిపోకుండా హిందువుగా జీవించేటువంటి ఒక ఆలోచనను ప్రపంచానికి అందించేటువంటి దేశంగా నిలబెట్టడం కోసమే ఈ సంస్థ ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ ఇదే ప్రయాణాన్ని కొనసాగించిందన్నారు. 2025 నాటికి ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా హిందూ సమ్మేళనం వైభవంగా నిర్వహించాలని, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి నిర్ణయిస్తూ, కుటుంబ వ్యవస్థ దేవాలయ వ్యవస్థ సామాజిక సమరసతతో మనమంతా హిందువులం బంధువులం అనే ఆత్మవిశ్వాసాన్ని నిర్మాణం చేయడమే హిందూ సమ్మేళనం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. అనేక దేశాలు మన దేశంపై దాడి చేసినప్పటికీ 2025 నాటికి కూడా గొప్ప దేశంగా ఎదుగుతూ ప్రపంచంలోనే సమర్థవంతమైన దేశంగా భారత్ నిలబడుతుందన్నారు. చివరిగా ముఖ్య అతిథులు శ్రీ గురు సేవానంద స్వాములు, ఆర్ఎస్ఎస్ అనంతపురం విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్ జీ లను బెళుగుప్ప హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. శ్రీనివాస విద్యా నికేతన్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి విచ్చేసిన వారికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున హిందూ బంధువులు పాల్గొన్నారు..



శ్రీ గురుసేవానంద స్వాములు, లక్ష్మణ్‌జీని సన్మానిస్తున్న హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు



వాజపేయి చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## మహానుభావుడు అటల్ బిహారీ వాజపేయి

**ఘనంగా అటల్ బిహారీ వాజపేయి జయంతోత్సవ వేడుకలు.. బిజేపి ప్రధాన కార్యదర్శి కుమారస్వామి..**

**పామిడి, డిసెంబర్ 25:**
రాజకీయాల్లో అపార అనుభవం గడించిన అటల్ బిహారీ వాజపేయి మంచి పరిపాలనాధ్యక్షుడిగా ఖ్యాతిని పొందిన అటల్ బిహారీ వాజపేయి మహానుభావుడని బిజేపి ప్రధాన కార్యదర్శి కుమారస్వామి పేర్కొన్నారు. భారత మాజీ ప్రదానమంత్రి అటల్ బిహారీ వాజపేయి జయంతోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం పట్టణంలోని బిజేపి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ రాజకీయాల్లో అపార అనుభవం గడించిన అటల్ బిహారీ వాజపేయి రాజకీయ ఉద్దండుడుగా గుర్తింపును పొందారని తెలిపారు. బిజేపి వ్యవస్థాపక అద్యక్షులుగా పార్టీని దేశవ్యాప్తంగా విస్తరింపజేసిన అటల్ బిహారీ వాజపేయి ప్రధానమంత్రిగా ప్రజాభ్యున్నతికి పాటుపడుతూ తన రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ దేశానికి అందించిన సేవలు రాజకీయాలకే వన్నె తెచ్చాయని కొనియాడారు. దేశానికి అందించిన సేవలను గుర్తించి 2015లో భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించగా అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్వయంగా అటల్ బిహారీ వాజపేయి ఇంటికెళ్ళి ప్రదానం చేయటం గర్వించదగ్గ విషయం అని తెలియజేశారు. రాజకీయ కోవిదుడు బహుముఖ ప్రజ్ఞాశాలి అటల్ బిహారీ వాజపేయి బౌతికంగా దూరం అయినప్పటికీ మనందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహెూన్నతుడు అన్నారు. అనంతరం అటల్ బిహారీ వాజపేయి జయంతోత్సవ కేకును కట్ చేసిన బిజేపి నాయకులు పలువురికి పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మనోజ్ కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లికార్జున ఆచారి తదితరులు పాల్గొన్నారు.



లాలెప్పను సత్కరిస్తున్న మండల టిడిపి నాయకులు కార్యకర్తలు

## అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు లాలెప్పకు ఘన సన్మానం

**కనేకల్, డిసెంబర్ 25:**
కణేకల్ మండలం నుండి అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా నియమితులైన లాలెప్పను గురువారం కణేకల్ మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు ఘజ మాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు లాలెప్ప గారినీ అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా నియమితులకు సహకరించిన ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు కు లాలెప్ప గారు ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర సంఘం ఉప్పర డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ చైర్మన్ ఆనంద్ రాజ్, మండల టిడిపి కన్వీనర్ వన్నారెడ్డి,సహకార సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా, నీటి సంఘం అధ్యక్షుడు బిటి రమేష్,మాజీ టిడిపి కన్వీనర్ సుదర్శన్,మార్కెట్ యార్డ్ అడ్వైజర్ చాంద్ భాషా,మాజీ ఎంపీపీ మబూ సాహెబ్ నాగప్ప,నాగభూషణ, వెంకటేశులు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లాలో నలుగురు ఎస్ఐల బదిలీ

**మదనపల్లి, డిసెంబర్ 25:**
అన్నమయ్య జిల్లాలో ఎస్ఐలను బదిలీచేస్తూ జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె1టౌన్ ఎస్ఐ అన్సర్ భాషను అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్ కు బదిలీచేయగా, ఇటీవల రామసముద్రం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన దిలీప్ కుమార్ ను మదనపల్లె 1టౌన్‌కు బదిలీ చేశారు. పెద్దమండెం ఎస్సై వెంకటేశ్వర్లును అన్నమయ్య డిసిఆర్బికి, తంబళ్లపల్లి ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డిని రామసముద్రానికి బదిలీచేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అనంతపురం కల్చరల్, డిసెంబర్ 25:
నగరంలోని క్రి సెంట్ విద్యా సంస్థ లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు గురువారం అందరూ కలిసి ఆనందో ఉత్సవాల తో గడిపారు. 1990 - 2021 మధ్య చదివిన విద్యార్థులు 25 సంవత్సరాల అల్యూమినియం ను ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల అధినేత కే యం షఫీ ఉల్లా, ప్రిన్సిపల్ షమీం షఫి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాలలో చదువుతున్న సమయంలో వాలి అనుభవాలను ఆనందంగా ఒకరికొకరు పంచుకొంటూ ఉద్యోగాలు ఎక్కడ చేస్తున్నది చెప్పుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం విద్యాసంస్థల అధినేతలకు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో షకీల్ షఫీ, సలీం భాష, తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

## కనేకల్లో ఘనంగా వాజ్ పేయి జయంతి వేడుకలు

**కనేకల్, డిసెంబర్ 25:**
భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా కణేకల్ పట్టణం బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా కార్యదర్శి కరణం నరేంద్ర స్వామి ఆధ్వర్యంలో భరత మాతా ముద్దు బిడ్డ అటల్ బిహారీ వాజపేయి జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. వాజపేయి గారి జయంతిని పురస్కరించుకొని కణేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్డు, పళ్ళు పంచడం జరిగింది .నరేంద్ర స్వామి మాట్లాడుతూ దేశం కొరకు వాజపేయి గారు తన జీవితాన్ని త్యాగం చేశారని, ఈ రోజు దేశంలో అందరికీ టెలికాం రంగం



నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు



రోగులకు బ్రెడ్లను పంపిణీ చేస్తున్న బిజెపి నాయకులు

అందుబాటులో ఉండటానికి వాజపేయి ఆజ్యం పోశారని, దేశ సంస్కృతికి, అభివృద్ధికి చిహ్నంగా ఉండేలా పంచ నిష్ఠలతో కమలం గుర్తును అటల్ బిహారీ వాజ్‌పేయి తీసుకొచ్చారని కొనియాడారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరు వాజపేయి గారి అడుగు జాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ కణేకల్ మండల అధ్యక్షులు తిప్పేస్వామి ఉపాధ్యక్షులు నాగరాజు కార్యదర్శి క్రాంతికుమార్ యాదవ్ కిసాన్ మోర్చా కార్యదర్సులు మల్లయ్య చౌదరి విజయకుమార్ చిక్కన్న నాగభూషణం మహిళ మండల అధ్యక్షులు నేత్రవతి మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బెళుగుప్ప లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున...**

**బెళుగుప్ప, డిసెంబర్ 25:**
బెళుగుప్పలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. చర్చిలలో క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బెళుగుప్ప లోని చర్చిలో క్రైస్తవ సోదరులు జరుపుకుంటున్న వేడుకలలో టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అయిన క్రిస్మస్ పండుగను అందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆరోగ్యం శుభ ఫలితాలు కలగాలని ఆకాంక్షించారు. క్రైస్తవ సోదరులకు హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఫాస్టర్ రాజు, క్రైస్తవ సోదరులకు కేక్ తినిపించారు. టిడిపి నాయకులు మల్లికార్జున ను ఆశీర్వదించారు.



బెళుగుప్పలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు



క్రిస్మస్ పండుగ సందర్భంగా పాస్టర్, క్రైస్తవ సోదరులకు కేక్ కట్ చేసి తినిపిస్తున్న టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున

# వైభవంగా గోదాదేవి కళ్యాణోత్సవం

**ఇంటింటికి తిరుప్పావై..**

**తాడిపత్రి, డిసెంబర్ 25**
తనకల్లు మండల కేంద్రంలో గురువారం ధనుర్మాసం 10వ రోజు సందర్భంగా ఇంటింటికీ తిరుప్పావై కార్యక్రమం, శ్రీరంగనాథస్వామి, శ్రీ గోదాదేవి అమ్మవారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం




శ్రీ రంగనాథ స్వామి,గోదాదేవి కళ్యాణోత్సవం గోదాదేవి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న తాడిపత్రి చింతల రాయుని ఆలయ అర్చకులు

సురేంద్రబాబు, సుధామణి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మండపంలో శ్రీ ఆండాళ్ అనుసరించిన తిరుప్పావై సేవా గోష్ఠి కార్యక్రమాన్ని తాడిపత్రి శ్రీ చింతల వెంకటరమణ స్వామి దేవస్థానం ఆలయ అర్చకులు చింతల రాయన్, శ్రీనివాస్ దేశికన్ లు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. అనంతరం శ్రీరంగనాథ స్వామి, శ్రీ గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా వివిధ పూలమాలలతో సుందరంగా అలంకరించి విశేష పూజలు గావించారు. తిరుప్పావై విశిష్టతను వివరించారు. అనంతరం కళ్యాణోత్సవం నిర్వహించారు. కళ్యాణోత్సవానికి భక్తులు భారీగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను అందజేశారు.



అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న గురుస్వాములు
అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న వెలుగు దేవరాజ్ కుటుంబ సభ్యులు

## శ్రీ అయ్యప్ప స్వామికి అభిషేకం, విశేష పూజలు

**అమరాపురం, డిసెంబర్ 25:**
అమరాపురంలో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీ అయ్యప్ప స్వామికి అభిషేకం, కుంకుమార్చన పూలతో అలంకరణ గురు స్వామి రామాంజి స్వామి హరి స్వామి,రాజశేఖర్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులు భజన కార్యక్రమం అయ్యప్ప స్వామి కీర్తనలు పాటలు నిర్వహించి అయ్యప్ప స్వామికి మహా మంగళహారతి తీర్థప్రసాదాలు అందజేశారు. గురువారం రాత్రి అయ్యప్ప భక్తులకు అన్నదానం వెలుగు దేవరాజ్ అందజేశారు. రేపు శుక్రవారం శ్రీ అయ్యప్ప స్వామి మండల పూజ ఘనంగా నిర్వహిస్తున్నట్లు గురుస్వామి రామాంజి స్వామి, రాజశేఖర్ స్వామి, స్వామి హరీ స్వామి తెలిపారు పూజా కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.



అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న వెలుగు దేవరాజ్ కుటుంబ సభ్యులు



సోలోమ్ ప్రార్థన మందిరంలో సందేశమిస్తున్న పాస్టర్ ఏ.టీ. ప్రకాష్ రావు

## సోలోమ్ ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు

**అమరాపురం, డిసెంబర్ 25:**
అమరాపురం షాలోమ్ మందిరంలో గురువారం పాస్టర్ ఏ.టి. ప్రకాష్ రావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మత్తయి సువార్త గురించి చర్చి పాస్టర్ ఏ. టి.ప్రకాష్ రావు , చర్చి పాస్టర్ ఏ.టి. ప్రకాష్ రావు యేసు జననం గురించి వివరించారు. టి.పి. దేవకుమార్, టి.పి కిరణ్ కుమార్ ,టి. పి. పుట్టోజిరావు. టి.పి ప్రశాంత్ కుమార్ వీరిచే చిన్నపిల్లలకు గిఫ్ట్ పంపిణీ చేశారు.. చిన్నపిల్లలు ఏసుప్రభు పాటలను వినిపించారు . విందు భోజనం అందజేశారు.



క్రిస్మస్ వేడుకల సందర్భంగా చిన్నారులకు కానుకలు పంపిణీ చేస్తున్న దృశ్యం.
క్రిస్మస్ పాటలు పాడుతున్న దృశ్యం



# ముదిగుబ్బలో గోదా రంగనాథుల ఉత్సవ వైభవం

### ధనుర్మాస ప్రత్యేక పూజలు.. ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం .. ఉత్తర ద్వార దర్శనం నిర్మాణం పూర్తి .. జనవరి 14న తిరుక్కళ్యాణ మహోత్సవం.. ధనుర్మాస శోభతో ముదిగుబ్బ

**శ్రీ సత్యసాయి జిల్లా ప్రత్యేక ప్రతినిధి (భూమి నాయుడు)**
**ముదిగుబ్బ, డిసెంబర్ 25:**
ముదిగుబ్బ పాతఊరులో వెలసిన ప్రసిద్ధ శ్రీ సూర్యచంద్ర అభయాంజనేయ స్వామి దేవాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పలు విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ నెల 30న శ్రీ వైకుంఠ ఉత్తర ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ గోదా రంగనాథ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.
ధనుర్మాసం ప్రారంభమైన 16వ తేదీ నుంచి జనవరి 14 వరకు ప్రతిరోజూ ఉదయం ఆలయంలో శ్రీ లక్ష్మీ గోదా రంగనాథ ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం, తిరుప్పావై వేదగోష్ఠి సాతుమురై సేవాకాల ఆరాధనలు, పల్గాండు మహామంగళ నీరాజనాలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుంటూ ధనుర్మాస ఫలాలను పొందుతున్నారు.



ఆలయ పురోహితులు తిరుచానూరు రంగస్వామి

జనవరి 14న వైభవంగా శ్రీ గోదా రంగనాథుల తిరుక్కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు తిరుచానూరు రంగస్వామి తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి విశేష పూజలు ప్రారంభమై, ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని జరిపించనున్నారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. రోజు ఉదయం 9 గంటలకు శ్రీ లక్ష్మీ గోదా రంగనాథుల తిరుక్కళ్యాణ మహోత్సవం జరగనుందని ఆలయ కమిటీ తెలిపింది. రోజు సాయంత్రం 5.30 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామం, శ్రీ లలిత సహస్రనామ పారాయణం, పుష్పార్చనలు, ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించడం జరుగుతోంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాన్ని అందించడం జరుగుతున్నది. రాత్రి వేళల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణలతో మహామంగళహారతి ఇస్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా ముదిగుబ్బతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఆలయం చుట్టూ భక్తిశ్రద్ధలతో కూడిన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు విశేషంగా కృషి చేస్తున్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గోదా రంగనాథ స్వామివారి దర్శనం, ముఖ్యంగా వైకుంఠ ఉత్తర ద్వారా దర్శనం చేసుకోవాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.



పూజలు అందుకుంటున్న
శ్రీ సూర్యచంద్ర అభయాంజనేయ స్వామి
శ్రీ లక్ష్మీ గోదా రంగనాథ స్వామి ఉత్సవమూర్తులు

## సీఎంను కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**అమరావతి, డిసెంబర్ 25:**
విజయవాడ సుస్థిర, ప్రణాళికబద్ధమైన అభివృద్ధికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించి గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చేయటం అత్యవసరమని సీఎం చంద్రబాబు కు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో



వీరివురు సీఎం చంద్రబాబు ను కలిసి ప్రతిపాదనలు అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో వున్న గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు పై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. నగర పరిసరాల్లోని 75 గ్రామాలు విలీనమై గ్రేటర్ విజయవాడ కార్పొరేషన్ ఏర్పాటు జరిగితే పారిశ్రామిక కారిడార్లు, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌లు, పర్యాటక పెట్టుబడులకు మరింత ప్రోత్సాహం లభించి, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని మరియు సమగ్ర నీటి సరఫరా, వరద నియంత్రణ చర్యలు సమర్థవంతంగా అమలు చేయటానికి అవకాశం వుంటుందని వివరించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా-కృష్ణా జిల్లా మధ్య ఉన్న పరిపాలనా విభజన వల్ల పోలీస్, రవాణా, శాంతి భద్రతలు, విమానాశ్రయ పరిపాలన వంటి అంశాల్లో తలెత్తుతున్న ప్రోటో కాల్ ఇబ్బందులకు ఒక పరిష్కారం లభిస్తుందన్నారు. విజయవాడ నగర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఎంపీ కేశినేని శివనాథ్ చేసిన ప్రతిపాదన పై సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు.

## నెల్లూరు గడ్డపైకి మూడు మండలాలు

**సైదాపురం, డిసెంబర్ 25:**
గత నెల రోజులుగా సాగుతున్న పోరాటానికి తెరపడుతోంది. నెల్లూరు జిల్లా నుంచి విడిదీసి తిరుపతి జిల్లాలో కలపాలని కూటమి ప్రభుత్వం లోజరిగిన ప్రయత్నాలు ప్రజల నిరసనలతో ప్రజలు అభీష్టం తో తిరిగి రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలను మాత్ర జిల్లా నెల్లూరులో చేర్చాలన్న ప్రజా ఆకాంక్ష నెరవేరబోతోందని తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం తుది గెజిట్ విడుదలకుసిద్ధమవడంతో ఆ ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని అర్థమవుతోంది. ఈ మూడు మండలాల జేఏసీ (జె ఏ సి) అలుపెరుగని పోరాటం వలన ?ఈ మండలాలను తిరిగి నెల్లూరులో చేర్చడంలో జిల్లాల సాధన సమితి (జె ఏ సి) పాత్ర వెలకట్టలేనిది. రాజకీయాలకు అతీతంగా ప్రజలను, మేధావులను, యువతను ఏకం చేయడంలో జేఏసీ విజయం సాధించిందని అర్థమవుతోంది. ఎన్ని పనులున్నా లెక్కచేయకుండా రాస్తారోకోలు, ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు చేపట్టి ప్రభుత్వానికి తమ నిరసనను బలంగా వినిపించింది. మండల కేంద్రం తిరుపతికి వెళ్లాలంటే అయ్యే అయ్యే దూరభారాన్ని గణంకాలతో సహా అధికారుల ముందు ఉంచి,వారినిఆలోచింపజేసింది. తద్వారా తమ తమ మండలాల్లోనే నిలుకునేలా చేసుకుంది.

## రెడ్డి గారి విందు హోటల్ ప్రారంభం

**నెల్లూరు, డిసెంబర్ 25:**
నెల్లూరు పాలెంలో ఏర్పాటు చేసిన లిరెడ్డిగారి విందు హోటల్‌ను ప్రముఖ హోటల్ వ్యాపారవేత్త అమరావతి కృష్ణారెడ్డి ప్రారంభించారు.ఈ హోటల్‌ను జగన్మోహన్ రెడ్డి, ప్రద్యుమ్న రెడ్డి సంయుక్తంగా ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ సూరాభాస్కర్ రెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, శివారెడ్డి, మహబూబ్ బాషా, పెంచలయ్య యాదవ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. హోటల్‌లో అందిస్తున్న భోజనం ఎంతో రుచికరంగా ఉందని ప్రారంభోత్సవానికి హాజరైన ప్రముఖులు, స్థానికులు అభినందనలు తెలిపారు. పరిశు భ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా రెడ్డిగారి విందు హోటల్ ప్రాంత ప్రజలకు మంచి సేవలు అందిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# టిడిపి పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి శ్రీనివాస మూర్తి

### సన్మానించిన అగళి మండల నాయకులు

**అగళి, డిసెంబర్ 25 :**
హిందూపురం పార్లమెంటరీ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఇరిగేపల్లి బి శ్రీనివాస్ మూర్తిని నియమించడం పట్ల మండల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అగళి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిప్పేస్వామి,జడ్పీటీసీ ఉమేష్,సింగల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, డైరెక్టర్ శివప్ప,ఎంపీపీ రేణుక కామరాజు,మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్,వైస్ ఎంపీపీ గాయత్రి హేమంత్ రాజు,సీనియర్ నాయకులు కెఎన్ రమేష్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు ఎం ఆర్ శివరాములు,శిల్పకెంచప్ప యాదవ్. మాజీ ఎంపీపీ లు,మాజీ సింగల్ విండో అధ్యక్షులు,డైరెక్టర్ లు, సర్పంచులు,మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు మాజీ ఎంపీటీసీ లు, తెలుగు దేశం పార్టీ అనుబంధ సంఘాల నాయకులు యువ నాయకులు కార్యకర్తలు అందరూ నూతన పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రెటరీని దుశ్శాలువా పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్ మూర్తి సీనియర్ నాయకులని ఆయనకున్న అపార అనుభవం సమర్థవంతమైన నాయకత్వంలో స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సహకారంతో అగళి మండలం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 42 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలోఇప్పటివరకు మారుమూల ప్రాంతమైన అగళి మండలానికి టిడిపి పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కేటాయించిన దాఖలాలు లేవు,ప్రస్తుతం పార్టీ అధిష్టానం గుర్తించి సీనియర్ నాయకులు శ్రీనివాస్ మూర్తిని టిడిపి హిందూపురం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించడం ద్వారా అగళి మండల ప్రజలను కూడా గౌరవించినట్టయింది అందుకుగాను మండల ప్రజల తరఫున తెలుగుదేశం పార్టీ శ్రేణులు అందరి తరఫున తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకి ఎమ్మెస్ రాజు వెంట ఎల్లప్పుడూ ఉండి ముందుకు నడిపిస్తున్న మడకశిర నియోజకవర్గ ప్రియతమ నాయకులు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి కి హృదయ పూర్వకమైన కృతజ్ఞతలు తెలియజేసారు.



శ్రీనివాస్ మూర్తిని హత్తుకుని శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శిల్పకెంచుయాదవ్



పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రెటరి బి శ్రీనివాసు మూర్తిని సన్మానిస్తున్న మాజీసర్పంచ్ నింగన్న.
శుభాకాంక్షలు తెలుపుతున్న అగళి మండల నాయకులు

# అంగన్వాడీలకు సెల్‌ఫోన్లు పంపిణీ

### మినీ అంగన్వాడీలకు మెయిన్ అంగన్వాడీ లుగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రొసీడింగ్స్ అందజేత.. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి..

**అగళి/మడకశిర డిసెంబర్ 25:**
మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు ప్రభుత్వం అందిస్తున్న సెల్ ఫోన్లను మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు, శ్రీ సత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం. ఎస్.రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 438 సెల్ ఫోన్లను అంగన్వాడీలకు ఎమ్మెల్యే అందించారు.అంతే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా 44 అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేస్తూ సంబంధిత ప్రొసీడింగ్ ఆర్డర్ల కాపీలను అంగన్వాడీలకు అందించారు.ఈ సందర్భంగా ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ భావి తరాలకు ముందస్తు పాఠాలు బోధిస్తూ, వారికి నాణ్యమైన భోజనం అందిస్తూ,తల్లిలా లాలిస్తూ చూసుకునే అంగన్వాడీల సేవలను కూటమి



ప్రభుత్వం గుర్తించి వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతోంది. అంగన్వాడీ సెంటర్లో చిన్న చిన్నగా పాఠాలు నేర్చుకోవడం మొదలు పెడుతున్న చిన్నారుల భవిష్యత్తును మంచి మార్గంలో పెట్టాల్సిన కీలక బాధ్యత అంగన్వాడీలపైనే ఉంది. ప్రారంభ దశలోనే మంచి అలవాట్లు నేర్పిస్తే వారు పెద్దవారు అయినకొద్దీ ఆ మార్గంలోనే వెళతారు. ఇలా ప్రతి అంగన్వాడీ బాధ్యతగా పిల్లల భవిష్యత్తుకు ఊతమందించాలి.వారికి సరైన సమయానికి నాణ్యమైన భోజనం అందించాలి.గర్భిణిలు, బాలింతలకు ప్రభుత్వం అందించేటువంటి పౌష్టికాహారాన్ని బాధ్యతగా అందించాలి అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లకు అంగన్వాడీలు శాలువాలతో సత్కరించి పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అగళి జెడ్పీటీసీ ఉమేష్, మడకశిర నియోజకవర్గం లోని ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు,సింగిల్ విండో అధ్యక్షులు, ఐసిడిఎస్ సిడిపిఓలు సూపర్వైజర్లు అంగన్వాడీ కార్యకర్తల సహాయకులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.
ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లను సన్మానించిన దృశ్యం



మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి భార్య జిల్లా ఉపాధ్యక్షురాలు రత్నమ్మకు సన్మానం చేస్తున్న అమరాపురం మండల డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, సీనియర్ నాయకుడు వీరప సముద్రం మంజునాథ్ ,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు

# టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు రత్నమ్మకు ఘన సన్మానం

**అమరాపురం డిసెంబర్ 25:**
అమరాపురం గ్రామం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి భార్య మాజీ సర్పంచ్ ,మాజీ ఎంపీపీ రత్నమ్మ శ్రీ సత్య సాయి జిల్లా ఉపాధ్యక్షురాలుగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ,మరియు శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి భార్య. రత్నమ్మ జిల్లా ఉపాధ్యక్షు రాలుగాఎంపిక అయినందుకు అమరాపురం మండల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ , మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, తెలుగుదేశం సీనియర్ నాయకుడు విరూప సముద్రం మంజునాథ్ దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా ఉపాధ్యక్షురాలు రత్నమ్మ ఇంటికి వెళ్లి మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి రత్నమ్మకు శాలువా పూలమాలతో సన్మానం చేశారు.హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పార్టీ అభివృద్ధి కోసం పనిచేసినందు కు ఈ పదవి దక్కిందని రత్నమ్మ తెలిపారు. పార్టీ అభివృద్ధి తన వంతు కోసం కృషి చేస్తానని తెలిపారు.




రత్నమ్మను సన్మానిస్తున్న వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి

# శంబాల మిస్టరీని ఛేదించిన ఆదిసాయికుమార్

శంబాల మిస్టరీని ఛేదించిన ఆది సాయికుమార్ ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం శంబాల. ఈ సినిమాకు యుగంధర్ ముని దర్శకత్వం వహించగా.. అర్చన ఐయ్యర్ కథానాయికగా నటించింది. రవి వర్మ, ఇంద్రనీల్, మీసాల లక్ష్మణ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. మహీధర్, రాజశేఖర్ నిర్మించారు. శంబాల అనే ఓ వెయ్యేళ్ల చరిత్ర కలిగిన గ్రామం చుట్టూ తిరిగే కథ ఇది. 1980వ దశకంలో ఆకాశం నుంచి పడిన ఒక వింత ఉల్క ఆ గ్రామంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆ ఉల్కను స్థానికులు 'బండ భూతం' అని పిలుచుకుంటారు. అది పడిన నాటి నుండి ఆ ఊరిలో ఊహించని వింత ఘటనలు జరుగుతుంటాయి. పాలకు బదులు రక్తం రావడం, వరుస హత్యలు, ఆత్మహత్యలతో గ్రామ ప్రజలు వణికిపోతుంటారు. ఈ రహస్యాన్ని ఛేదించేందుకు ప్రభుత్వం తరపున విక్రమ్ (ఆది సాయికుమార్) రంగంలోకి దిగుతాడు. అసలు ఆ ఉల్క వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? గ్రామ దేవత చరిత్రకు, ఈ ఘటనలకు సంబంధం ఏంటి? దేవి (అర్చన ఐయ్యర్) పాత్ర ఈ కథను ఏ మలుపు తిప్పింది? చివరకు విక్రమ్ ఆ ఊరిని ఎలా కాపాడాడు? అన్నదే ఈ సినిమా కథ. దర్శకుడు యుగంధర్ ముని ఈ చిత్రంతో తన కథా బలమేంటో నిరూపించుకున్నారు. . ప్రేక్షకుడిని శంబాల అనే ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి, అక్కడి పాత్రలతో పాటు ప్రయాణం చేయించడంలో దర్శకుడు సక్సెస్ అయ్యారు. వెన్నులో వణుకు పుట్టించే అనుభూతి సినిమా ప్రారంభం నుంచే శంబాల గ్రామం యొక్క వెయ్యేళ్ల చరిత్ర, అక్కడి వింత పరిస్థితులను పరిచయం చేస్తూ దర్శకుడు ఉత్కంఠను పెంచారు. ఒక్కో ఘటన బయటపడుతుంటే సీటులో కూర్చున్న ప్రేక్షకుడికి వెన్నులో వణుకు పుడుతుంది. ముఖ్యంగా ప్రీ-ఇంటర్వెల్ నుంచి ఇంటర్వెల్ కార్డ్ పడే వరకు ప్రతి సీన్ ఊపిరి బిగపట్టుకుని చూసేలా ఉంటుంది. ఆ అదిరిపోయే ఇంటర్వెల్ బ్లాక్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేస్తుంది.ఫస్ట్ హాఫ్‌లో రవి వర్మ, మీసాల లక్ష్మణ్ తమ నటనతో భయపెడితే.. సెకండాఫ్‌లో ఇంద్రనీల్ సీన్లు ప్రేక్షకులను థ్రిల్‌కు గురి చేస్తాయి. సినిమాలో కావాల్సినన్ని 'హై మూమెంట్స్'ను దర్శకుడు పక్కాగా ప్లాన్ చేసుకున్నారు. క్లైమాక్స్ వరకు కథ గాడి తప్పకుండా నడిపించడంలో యుగంధర్ తన ప్రతిభను చాటుకున్నారు. తన రెగ్యులర్ లవర్ బాయ్ లేదా మాస్ ఇమేజ్‌ని పక్కన పెట్టి, ఇందులో చాలా సీరియస్ మరియు ఇంటెన్స్ రోల్‌లో కనిపించారు. సెటిల్డ్ పర్ఫార్మెన్స్‌తో సినిమాను తన భుజాన మోశారు.




# ప్రభాస్ అభిమానులకు కిక్కు



రాజే యువరాజే సాంగ్ ప్రోమో విడుదల

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ హర్రర్ కామెడీ ఎంట్టంల్గ÷నర్ 'ది రాజా సాబ్'. టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఒక స్పెషల్ గిఫ్ట్‌ను అభిమానులకు అందించింది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్ర నిర్మాణ సంస్థ 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ' ఒక బ్యూటిఫుల్ మ్యూజికల్ సర్ప్రైజ్‌ను విడుదల చేసింది. 'రాజే యువరాజే..' అంటూ సాగే పాట ప్రోమోను రిలీజ్ చేస్తూ, ప్రభాస్ వింటేజ్ లుక్స్‌తో ఫ్యాన్స్‌ను ఖుషీ చేసింది. ఈ పాటలో థమన్ అందించిన సంగీతం మ్యాజికల్ గా ఉందని సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ ముగ్గురు భామలు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని జనవరి 9న గ్రాండ్‌గా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతుంది చిత్రబృందం.

# హారర్ థ్రిల్లర్ సినిమాలో మరోటి ఈషా



నేటి తరం ప్రేక్షకులకు హారర్ థ్రిల్లర్ సినిమాలంటే ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. మసూద వంటి హారర్ థ్రిల్లర్ తర్వాత మళ్లీ ఆ రేంజ్‌లో ఒక సినిమా వచ్చింది. ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సమర్పణలో, శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఈషా'. త్రిగుణ్, అఖిల్ రాజ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో నటించగా సిరి హనుమంతు, పృథ్వీరాజ్, మైమ్ మధు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆర్ఆర్ ధృవన్ సంగీతం అందించాడు. ఈ చిత్రం భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సైన్స్ మరియు మూఢనమ్మకాల మధ్య నడిచిందీ కథ.

కల్యాణ్ (త్రిగుణ్), వినయ్ (అఖిల్ రాజ్), నయన (హెబ్బా పటేల్), అపర్ణ (సిరి హనుమంతు) నలుగురు ప్రాణ స్నేహితులు. వీరు దెయ్యాలు, ఆత్మలు లేవని బలంగా నమ్మే హేతువాదులు. అమాయక ప్రజలను భయపెట్టి దోచుకునే నకిలీ బాబాల గుట్టు రట్టు చేయడమే వీరి పని. ఈ క్రమంలోనే ఆంధ్ర ? ఒడిశా సరిహద్దులో అద్భుత శక్తులు ఉన్నాయని ప్రచారం పొందిన ఆది దేవ్ (పృథ్వీరాజ్) అనే బాబా గుట్టురట్టు చేయాలని నిర్ణయించుకుంటారు. అయితే ఆ బాబా ఈ నలుగురికి ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే మీరేం చేస్తారు? అని సవాలు విసురుతాడు. ఆ సవాలును స్వీకరించిన ఈ నలుగురు ఒక భయంకరమైన పాడుబడిన బంగ్లాలో మూడు రోజుల పాటు నివసించడానికి వెళ్తారు. ఆ బంగ్లాలో వారికి ఎదురైన భయానక పరిస్థితులు ఏమిటి? పుణ్యవతి అనే ఆత్మకు, గిరిజనుడైన మైమ్ మధుకు ఉన్న సంబంధం ఏమిటి? చివరకు ఆ మిత్రులు ఆత్మల ఉనికిని అంగీకరించారా లేదా? అన్నదే ఈ చిత్ర కథ. దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఎంచుకున్న పాయింట్ కొత్తదేమీ కాకపోయినా, దానిని ప్రజెంట్ చేసిన విధానం ఆకట్టుకుంటుంది. సాధారణంగా హారర్ సినిమాల్లో ఉండే రొటీన్ ఫార్మాట్‌లోనే సినిమా మొదలైనప్పటికీ, ఇంటర్వెల్ ముందు వచ్చే ట్విస్ట్‌లు మరియు విజువల్స్ ప్రేక్షకులను కథలోకి తీసుకువెళ్తాయి. సినిమా మొదటి సగం పాత్రల పరిచయం మరియు బాబా సవాల్‌తో కాస్త నెమ్మదిగా సాగుతుంది. అయితే బంగ్లాలోకి ప్రవేశించిన తర్వాత వచ్చే కొన్ని హారర్ సీన్లు భయపెడతాయి.

సెకండాఫ్‌లో అసలు కథ మొదలవుతుంది. ఆత్మలు ఎందుకు కనిపిస్తాయి? మనిషి చనిపోయిన తర్వాత కూడా ఎందుకు ఆత్మగా మిగిలిపోతాడు? అనే అంశాలను ÷-లకైమాక్స్‌లో సైంటిఫిక్ అండ్ ఎమోషనల్ పాయింట్‌తో ముడిపెట్టడం బాగుంది. ముఖ్యంగా సెకండ్ పార్ట్ కోసం ఇచ్చిన లీడ్ ఆసక్తిని రేకెత్తిస్తుంది. నటీనటుల ప్రతిభ విషయానికి వస్తే.. త్రిగుణ్ మరియు హెబ్బా పటేల్ తమ అనుభవంతో పాత్రలకు పూర్తి న్యాయం చేయడమే కాకుండా, సీరియస్ సన్నివేశాల్లో తమ నటనతో ప్రేక్షకులను మెప్పించారు. ఈ సినిమాకు అసలైన బలంగా నిలిచిన మైమ్ మధు, గిరిజన పాత్రలో తన ఆహార్యం మరియు నటనతో వెన్నులో వణుకు పుట్టించేలా భయపెట్టారు. బాబా పాత్రలో పృథ్వీరాజ్ చాలా గంభీరంగా కనిపించినప్పటికీ, ఆ పాత్ర నేపథ్యం గురించి కథలో ఇంకాస్త విపులంగా వివరించి ఉంటే బాగుండేదనిపిస్తుంది. ఇక సిరి హనుమంతు మరియు అఖిల్ రాజ్ తమకు కేటాయించిన పరిధి మేరకు చక్కగా నటించి ఆకట్టుకున్నారు. ధృవన్ అందించిన నేపథ్య సంగీతం సినిమా మూడ్‌ను ఎలివేట్ చేసింది. హారర్ సీన్స్‌లో వచ్చే సౌండ్ ఎఫెక్ట్స్ థియేటర్లో మంచి అనుభూతిని ఇస్తాయి. సంతోష్ విజువల్స్ పాడుబడిన బంగ్లాలోని భయానక వాతావరణాన్ని అద్భుతంగా బంధించాయి. దర్శకుడు శ్రీనివాస్ మన్నె పాత కథనే కొత్తగా చెప్పే ప్రయత్నం చేశారు.

# తెలంగాణ పల్లె కథ దండోరా

తెలంగాణ పల్లె కథ..దండోరా కథానాయికల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల తర్వాత దండోరా సినిమా పేరు మరింతగా ప్రచారమైంది. కులవివక్ష వేళ్లూనుకుపోయిన ఓ ప్లలెటూరు తుళ్లూరు. తెలంగాణకు చెందిన ఆ ఊరిలో అగ్ర కులానికి చెందిన ఓ మోతుబరి శివాజీ (శివాజీ) కూడా వివక్షకు గురవుతాడు. కన్న కొడుకు విష్ణు (నందు)తోనూ ఆయనకు మాటలుండవు. చివరకు ఆయన మరణించినా తన కుల సంఘం శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు చేయడానికి వీల్లేదని పెద్దలు తీర్మానిస్తారు. అసలు అగ్ర కులానికి చెందిన శివాజీని కుల పెద్దలు ఎందుకు బహిష్కరించారు?ఆయనకీ, శ్రీలత (బిందు మాధవి)కీ మధ్య సంబంధం ఏమిటి? ఊరిలో తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు గురైన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు ఎలాంటివి? శివాజీకి అంతిమ సంస్కారాల నిర్వహణ విషయంలో తలెత్తిన సంఘర్షణపై ఆయన కుటుంబ సభ్యులు, ఊరి సర్పంచ్ (నవదీప్) తీసుకున్న నిర్ణయం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై చూడాల్సిందే. సమాజంలో పాతుకుపోయిన వివక్షపై కొత్త దర్శకుడు మురళీకాంత్ 'దండోరా'తో ఓ ప్రయత్నం చేశారు. కుల వివక్ష నేపథ్యాన్ని కొత్త కోణంలో ఆవిష్కరించిన తీరు ఈ సినిమాకు బలం. పరువు హత్యలు.. కుల వివక్ష.. కుల అహంకారంతోనే చోటు చేసుకుంటుంటాయి. మన సినిమాలు చాలావరకూ పరువు హత్యలకు గురైన బాధితుల కోణాన్నే స్పృశించాయి. కానీ, అలాంటి సంఘటనలకు పాల్పడిన కుటుంబాలు కూడా ఛిన్నాభిన్నమవుతాయని, ఆ కుటుంబ సభ్యులకు తీరని వేదననే మిగులుస్తుందని ఇందులో ఆలోచన రేకెత్తించేలా చెప్పారు దర్శకుడు. అగ్ర కులాల్లోని వివక్షనూ, అదే సమయంలో అక్కడ కూడా ఈ జాడ్యాన్ని భరించలేని వ్యక్తిత్వాల్ని, వాళ్ల నిస్సహాయతనీ ఇందులో చూపించిన విధానం చాలా బాగుంది. 2004తో మొదలై, 2019 వరకూ సాగే కథ ఇది. ఆరంభ సన్నివేశాలతోనే దర్శకుడు ప్రేక్షకుల్ని కట్టిపడేశాడు. తాను చెప్పాలనుకున్న




విషయంలోని గాఢతని చాటుతూ కథలో లీనం చేయిస్తాడు. శివాజీ పాత్రలోని సంఘర్షణ, మార్పు సినిమాకి ప్రధాన బలం. శివాజీ పాత్ర మార్పు నేపథ్యంలో సన్నివేశాల్లో భావోద్వేగాలు సరిపోలేదనిపిస్తుంది. పతాక సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఈ సినిమాకి సంభాషణలే ప్రధాన బలం. 'మన చావు బతుకులు ఊరికి దూరంగానే' అంటూ ఆరంభ సన్నివేశాల్లోని సంభాషణలు మొదలుకొని.. 'చావు అనేది మనిషికి ఇచ్చే ఆఖరి మర్యాద, అది మర్యాదగానే జరగాలి' వంటి సంభాషణలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. నటులు ఈ సినిమాపై బలమైన ప్రభావం చూపించారు. ప్రతి ఒక్కరూ ఆయా పాత్రల్లో జీవించారు. అందుకే చిన్న పాత్ర అయినా సరే, సినిమాపై ప్రత్యేకమైన ముద్ర వేసింది. ముఖ్యంగా శివాజీ ప్రథమార్ధంలో చేసిన సందడి ఆయన 'కోర్ట్' సినిమాలో చేసిన మంగపతి పాత్రని గుర్తు చేసింది. ద్వితీయార్ధంలో శివాజీ పాత్రలో మార్పు నేపథ్యంలో సన్నివేశాలు ఆయన నటనలో అనుభవాన్ని చాటుతాయి. శ్రీలత పాత్రలో బిందు మాధవి ఒదిగిపోయారు. ఆ పాత్ర ఎంతో హుందాగా ఉంటుంది. సినిమాకి ఆమె నటన ప్రత్యేక ఆకర్షణ. రవికృష్ణ, మణికా ప్రేమజంటగా కనిపించిన తీరు, ఆ పాత్రల్లో వారి అభినయం సహజంగా ఉంది. సర్పంచ్ సాబ్‌గా నవదీప్ చేసిన సందడి మరింతగా ఆకట్టుకుంటుంది. ప్రతి పాత్రనీ దర్శకుడు చాలా బాగా డిజైన్ చేశారు. దర్శకుడు మురళీకాంత్ చెప్పాలనుకున్న విషయాన్ని బలంగా చెప్పారు.

# బైరాన్‌పల్లి పోరాటానికి తెరరూపం

ఈ ఏడాది చివరి వారంలో అందరి దృష్టిని ఆకర్షించిన చిత్రాల్లో 'ఛాంపియన్' కూడా ఒకటి. రోషన్ హీరోగా నటించిన ఈ సినిమాని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. 'మహానటి', 'సీతారామం' లాంటి విజయాల తర్వాత స్వప్న దత్ నిర్మించారు. చిత్రంలోని పాటలు బాగా పాపులర్ కావడంతో సినిమాపై సర్వత్రా ఆసక్తి న ఎలకొంది.

హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లిలాంటి కొన్ని ఊళ్లు మాత్రం నిజాంకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్నాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి.విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్‌గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా సరే 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటాడు. దానికోసం తను ముందుగా విదేశాల నుంచి వచ్చిన కొన్ని ఆయుధాల్ని అక్రమంగా హైదరాబాద్ నుంచి బీదర్‌కు చేర్చాల్సి ఉంటుంది. మరి ఆ పని పూర్తి చేసి.. ఇంగ్లాండ్ వెళ్లాలనుకున్న మైఖేల్ దారి తప్పి బైరాన్‌పల్లికి వెళ్లడానికి కారణమేంటి?యుద్ధమంటే నచ్చని అతను ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు? బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు దేశ్‌ముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? ఈ కథలో రాజిరెడ్డి (నందమూరి కల్యాణ్ చక్రవర్తి), తాళ్లపూడి చంద్రకళ (అనస్వర రాజన్), సుందరయ్య (మురళీ శర్మ) తదితరుల పాత్రలకున్న ప్రాధాన్యత ఏంటి? అన్నది మిగిలిన కథ. నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల అకృత్యాలకు ఎదురొడ్డి నిలిచి.. వీరోచితంగా పోరాడిన ఘనత, చరిత్ర బైరాన్‌పల్లి సొంతం. అప్పట్లో ఆ ఊరి వాసులు సాగించిన స్ఫూర్తిదాయక పోరాటాన్ని.. ప్రాణత్యాగాలను ఈ 'ఛాంపియన్'తో ఉద్వేగభరితంగా మనసులకు హత్తుకునేలా తెరపై చూపించారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. నిజానికిది తెలిసిన కథైనప్పటికీ.. దాన్ని ఓ ఆటగాడి కోణం నుంచి నడిపిన విధానం.. అందులో ఓ స్వచ్ఛమైన ప్రేమకథను అల్లుకున్న తీరు.. ఆఖరికి వీళ్ల ప్రయాణాన్ని ఎంతో సహజంగా పోరు బాట వైపు నడిపించిన విధానం సినిమాకి కొత్తదనాన్ని ఇచ్చాయి. ఇది విప్లవం, పోరాటం నేపథ్యాలతో ముడిపడినా ఆద్యంతం మంచి భావోద్వేగాలతో నిండిన డ్రామాలా ముందుకు సాగడానికి దర్శకుడు ఎంచుకున్న ఈ పంథానే ప్రధాన కారణం. సర్దార్ వల్లభభాయ్ పటేల్.. హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేసేందుకు చేసే ప్రయత్నాలతో సినిమా ఆసక్తికరంగా మొదలవుతుంది. ఆ వెంటనే నిజాం నిరంకుశ పాలనను.. రజాకార్ల దౌర్జన్యాల్ని కళ్లకు కట్టారు. హీరో బైరాన్‌పల్లికి వచ్చాక కథ అక్కడక్కడే తిరుగుతున్న అనుభూతి కలిగినా.. ఆ ఊళ్లోని పాత్రలు.. ముఖ్యంగా తాళ్లపూడి చంద్రకళగా కథానాయిక చేసే అల్లరి అన్నీ ఆకట్టుకుంటాయి. ఎప్పుడైతే బైరాన్‌పల్లిపై రజాకార్ల దాడి జరుగుతుందో.. సరిగ్గా అప్పుడే కథానాయకుడి పాత్రలోని హీరోయిజం బయటకొస్తుంది.




తను ఆ ఊరి పోరాటంలో భాగమవ్వడం.. మరోవైపు రజాకార్లకు తను శత్రువుగా మారడం.. ఈ క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలతో ద్వితీయార్ధంపై అంచనాలు రెట్టింపవు తాయి.హీరో తండ్రి నేపథ్యాన్ని సుభాష్ చంద్రబోస్‌తో ముడిపెట్టిన తీరు ప్రేక్షకులకు మంచి కిక్ ఇస్తుంది. ఇక దాదాపు 20నిమిషాలకు పైగా సాగే పతాక పోరు.. అందులో రజాకార్లపై బైరాన్‌పల్లి వాసులు చేసే వీరోచిత పోరాటం ఆద్యంతం ఉద్విగ్నభరితం, రోమాంచితమే. క్లైకైమాక్స్‌లో కాస్త సినిమాటిక్ లిబర్టీ తీసుకున్నా.. సినిమాని ముగించిన తీరు హృదయాల్ని బరువెక్కిస్తుంది.మైఖేల్ సి విలియమ్స్ పాత్రలో రోషన్ సహజంగా ఒదిగిపోయాడు. లుక్స్ పరంగా.. నటన పరంగా చాలా కొత్తగా కనిపించాడు. తెలంగాణ యాసను చాలా చక్కగా పట్టుకున్నాడు. యాక్షన్ ఘట్టాల కోసం తను పడిన కష్టం.. అలాగే డ్యాన్సుల్లో తను చూపించిన ఈజ్ తెరపై కనిపిస్తుంది. తాళ్లపూడి చంద్రకళగా అనస్వర నటనా ప్రాధాన్యమున్న పాత్రలో మెరిసింది. రోషన్‌తో ఆమె కెమిస్ట్రీ బాగుంది. రాజిరెడ్డి పాత్రకు నందమూరి కల్యాణ్ చక్రవర్తి పాత్ర నిండుదనాన్ని అద్దింది. సుందరయ్యగా మురళీశర్మ ఆకట్టుకుంటారు. రచ్చరవి, మురళీధర్ గౌడ్, బలగం సంజయ్, అర్చన.. ఇలా తెరపై కనిపించిన పాత్ర ప్రేక్షకుల మదిలో గుర్తుండిపోయేలా ఉంటుంది. ఒక్క సినిమాలో ఇన్ని పాత్రల్ని గుర్తుండిపోయేలా మలచడం మామూలు విషయం కాదు. తెలిసిన కథను దర్శకుడు ప్రదీప్ అద్భుతమైన డ్రామాతో అందరికీ హత్తుకునేలా చూపించగలిగారు. టెక్నికల్‌గా ఇది చాలా బలమైన సినిమా. మిక్కీ జే మేయర్ సంగీతం, నేపథ్య సంగీతం, తోటతరణి ఆర్ట్ వర్క్, మదీ విజువల్స్ ప్రతిదీ దర్శకుడు ఊహకు అద్భుతంగా ప్రాణం పోశాయి.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.